ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 22.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 30 సెప్టెంబరు 2025



కొత్తూరు అమ్మవారి ఆలయ ఆవరణలో ఉత్సవమూర్తులకు రేణుకాదేవి, సరస్వతీదేవి, మధుర మీనాక్షీదేవి అలంకారం



పాతూరు అమ్మవారి ఆలయ ఆవరణలో ఉత్సవమూర్తికి సరస్వతీదేవి అలంకారం

భగవతీ... భారతీ..!

చదువుల తల్లిగా దుర్గమ్మ

నవరాత్రి ఉత్సవాలలో ఎనిమిదో రోజు దుర్గమ్మ సరస్వతీ దేవి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతపురం శంకరమఠంలోని శారదాదేవి ఆలయంలో 150 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. చదువుల తల్లి అలంకరణ కావడంతో విద్యార్థులు అమ్మవారి ఆలయాలకు విశేషంగా తరలివచ్చి, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్



అనంతపురం నగరంలోని శివకోటి దేవాలయంలో సరస్వతీదేవి అలంకారంలో శివకామేశ్వరి మాత

రేగడి రెడీ

రేపట్నుంచి రబీ సీజన్

నల్లరేగడి భూములను సిద్ధం చేసుకున్న రైతులు

పదును వాన పడితే విత్తేయడమే..

అనంతపురం అర్బన్/బెళుగుప్ప సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పప్పుశనగ విత్తుకు నల్లరేగడి భూములను రైతులు సర్వం సిద్ధం చేసుకున్నారు. రబీ సీజన్‌కు ముందే పదును వర్షం పడటంతో నల్లరేగడి భూముల్లో ఇప్పటికే సేద్యం పనులు పూర్తయ్యాయి. గత నెలలో వరుసగా పదును వానలు పడటంతో సేద్యం చేసుకున్నారు. అక్టోబరు 1వ తేదీన రబీ సీజన్ ప్రారంభం కానుంది. ఈసారి రబీ సీజన్‌కు ముందుగానే పదిరోజులుగా పొలాల్లో డీఏపీ, ఇతర రకాల ఎరువులు వేసుకుంటున్నారు. మరోమారు పదును వర్షం పడితే పప్పుశనగ విత్తనం వేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాల కోసం చిన్న, సన్నకారు రైతులు ఎదురు చూస్తున్నారు.

పప్పుశనగ కేటాయింపుల్లో కోత...!

ఏటా రబీ సీజన్‌లో 55వేల హెక్టార్లకుపైగానే పప్పుశనగ పంట సాగవుతోంది. పప్పుశనగ కేటాయింపుల్లో ప్రభుత్వం కోత పెట్టింది. గతేడాది జిల్లాకు 27వేల క్వింటాళ్ల పప్పుశనగను కేటాయించారు. ఈసారి 14వేల క్వింటాళ్లే ఇవ్వనుంది. జిల్లాలో ఎక్కువ శాతం మంది సబ్సిడీ విత్తనాలపైనే ఆధారపడి పంటను సాగు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, పప్పుశనగ కేటాయింపులు పెంచాలని రైతులు కోరుతున్నారు.



పుట్లూరు వద్ద పప్పుశనగ విత్తేందుకు సిద్ధంగా ఉంచిన నల్లరేగడి పొలం

పప్పుశనగ సబ్సిడీ ధర ఖరారు..!

క్వింటా పూర్తి ధర రూ.7800

సబ్సిడీతో రైతకు ఇచ్చే ధర రూ.5,850 (6వ పేజీలో..)



బెళుగుప్పలో పప్పుశనగ విత్తనం గొర్రును సిద్ధం చేసుకుంటున్న రైతులు

డీఏపీకి డిమాండ్

రబీ సీజన్‌కు ముందుగానే పదును వర్షాలు పడటంతో నల్లరేగడి భూముల్లో పప్పుశనగ విత్తు కోసం కొన్ని రోజులుగా దుక్కులు మొదలు పెట్టారు. విత్తనం వేసేందుకు ముందుగా డీఏపీ, చెక్కను దుక్కిలో వేసుకుంటున్నారు. మొక్క ఎదుగుదల, రోగనిరోధక శక్తిని పెంచేందుకు డీఏపీ బాగా ఉపయోగపడుతుంది. ఈ పరిస్థితుల్లో డీఏపీకి డిమాండ్ పెరిగింది. డీఏపీ బస్తా (50 కేజీలు) ఎమ్మార్పీ రూ.1350 ఉంది. ఎకరాకు 2 బస్తాలదాకా డీఏపీ ఎరువును వాడుతున్నారు. మరికొందరు ఎకరాకు బస్తా చొప్పున డీఏపీ, చెక్క వేసుకుంటున్నారు. డీఏపీకి డిమాండ్ పెరగడంతో నల్లరేగడి భూములున్న ప్రాంతాల్లోని డీలర్లు ధరలు (మిగతా 6లో...)

క్యాన్సర్ బాధితులకు

సమగ్ర వైద్యం

వచ్చే ఏడాది జిల్లాలో క్యాన్సర్ వైద్యశాల ఏర్పాటు

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

సూపర్ స్పెషాలిటీలో ప్రపంచ హృదయ దినోత్సవం



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితుల కోసం జిల్లాలో సమగ్ర క్యాన్సర్ వైద్యశాల ఏర్పాటు చేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో సోమవారం నిర్వహించిన ప్రపంచ హృదయ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కార్డియాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్ అధ్యక్షత వహించారు. కలెక్టర్ ఆనంద్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీ, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బెనడిక్ట్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ డేవిడ్ సెల్వరాజ్‌తో కలిసి మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రపంచంలో 20 శాతం మరణాలకు గుండె జబ్బులు కారణమని, రెండో స్థానంలో క్యాన్సర్ బాధితులు ఉన్నారని అన్నారు. ఐసీఎంఆర్ నివేదికల ప్రకారం దేశవ్యాప్తంగా 15.60 లక్షల మంది క్యాన్సర్ బాధితులు ఉన్నారని తెలిపారు. అందుకే ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్యాన్సర్ (మిగతా 6లో...)

రేపటి నుంచి ఆధార్ చార్జీల పెంపు



ఆధార్ కేంద్రం వద్ద వేచిఉన్న కార్డుదారులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆధార్ సేవల ధరలు అక్టోబరు 1 నుంచి పెరగనున్నట్లు ఉడాయ్ సంస్థ ప్రకటించింది. ఆధార్ కార్డులో చిరునామా, పేరు, డేటా ఆఫ్ బర్త్‌లను మార్పు చేయాలంటే గతంలో రూ.50 వసూలు చేసేవారు. ఇప్పుడు కొత్త ధరల ప్రకారం రూ.75 కానుంది. ఫొటో, బయోమెట్రిక్ అప్‌డేట్‌కు ఇదివరకూ రూ. 100లు ఉండగా ఇప్పుడు రూ.125కు చేరుకుంది. మరోవైపు పోర్టల్ ద్వారా చిరునామా మార్పు(కార్డుదారుడు నేరుగా సెల్, సొంత కంప్యూటర్‌లతో) చేసుకునే వారికి గతంలో రూ.50లు ఉండగా రూ. 25లు పెంచింది. కాగా ఆధార్ కార్డు పోగొట్టుకున్న వారు కొత్త ఆధార్ పొందాలంటే అప్లికేషన్ ఫీజు రూ.40లు చెల్లించేలా నిర్ణయించింది. కొత్తగా ఆధార్ కార్డు పొందగోరువారికి యథాతథంగా ఉచిత సేవలు కొనసాగనున్నాయి.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం వర్షం కురిసింది. గుంతకల్లు, గుత్తి మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. శింగనమల, విడపనకల్లు, ఉరవకొండ, బెళుగుప్ప తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. ఆదివారం రాత్రి ఉరవకొండ, గార్లదిన్నె, ఆత్మకూరు, అనంతపురం ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్ సోమవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి రూ.12వేలు పలికాయన్నారు. మొత్తంగా 254టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.19

అనంతపురం రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో సోమవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.19తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్ కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.10వేలు, సరాసరి రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,850టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పింఛన్‌లకు రూ.125.73 కోట్లు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): అక్టోబరు నెల పింఛన్‌లకు జిల్లాలోని 2,82,332 మంది లబ్ధిదారులకు రూ.125.73 కోట్లు మంజూరైందని డీఆర్‌డీఏ పీడీ శైలజ సోమవారం తెలిపారు. ఒకటో తేదీ ఉదయం నుంచి ఇళ్ల వద్దకు సచివాలయ సిబ్బంది వచ్చి పింఛన్ సొమ్ము అందజేస్తారని తెలిపారు. రెండో తేదీ పండుగ సెలవు అయినందున, తొలి రోజు పింఛన్ తీసుకోని లబ్ధిదారులు 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్థానిక సచివాలయంలో పింఛన్ సొమ్ము తీసుకోవాలని సూచించారు.

కామెంట్స్..

కాక..!

- సోషల్ మీడియా పోస్టుల చుట్టూ వివాదాలు
- ఓ వైసీపీ నేతపై అదే పార్టీ మహిళా కార్యకర్త హాట్‌కామెంట్స్
- ఎమ్మెల్యే దగ్గుపాటి పేరుతో ఫేక్ ఖాతా నుంచి పోస్టులు.. టూటౌన్‌లో ఫిర్యాదు
- పెరుగుతున్న సోషల్ మీడియా వార్



వన్‌టౌన్ పోలీసు స్టేషన్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కామెంట్స్ కాంట్రవర్సీగా మారుతున్నాయి. హాట్, హాట్ కామెంట్స్ కాక పుట్టిస్తున్నాయి. కొన్ని పోలీసు స్టేషన్ల వరకూ వెళ్తుంటే.. మరికొన్ని కేసుల వరకూ వెళ్తున్నాయి. పలు సోషల్ మీడియా వేదికల్లో కొందరు చేస్తున్న కామెంట్లపై ఇటీవలిగా జిల్లాలో కేసులు నమోదవుతున్నాయి. ఒక వైసీపీ నాయకుడి కుటుంబీకులపై అదే పార్టీకి చెందిన మహిళా కార్యకర్త హాట్ కామెంట్స్ చేశారు. దీనిపై పోలీసులకు నాయకుడు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సదరు మహిళపై కేసు నమోదు చేశారు. ఇటీవల కొందరు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేరున ఓ ఫేక్ సోషల్ మీడియా అకౌంట్‌ను సృష్టించి, కామెంట్స్ చేశారు. దీనిపై టీడీపీ అర్బన్ సోషల్ మీడియా టీం.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోషల్ మీడియా వేదికగా కామెంట్స్ పొలిటికల్ వైబ్రేషన్స్ తీసుకొస్తున్నాయి. కేసులకు దారి తీస్తున్నాయి.

కార్యకర్త కామెంట్స్‌పై కేసు

అనంతపురంలోని వేణుగోపాల్ నగర్‌కు చెందిన ఓ వైసీపీ నాయకుడు, ఆయన భార్యపై వైసీపీకి చెందిన గీతాంజలి అనే కార్యకర్త ఇటీవల చేసిన కామెంట్స్ వివాదాస్పదంగా మారాయి. సదరు కార్యకర్త.. వైసీపీ నాయకుడు, ఆయన భార్యను టార్గెట్ చేస్తూ... అసభ్య పదజాలం వాడుతూ.... ఆడియో విడుదల చేసింది. ఆ ఆడియోను ఇటీవల సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసింది. ఈ కామెంట్స్ అటు స్థానికులు, ఇటు వైసీపీ వర్గీయుల్లో చర్చనీయాంశంగా మారాయి. దీంతో సదరు నాయకుడు.. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో మహిళా కార్యకర్తపై ఫిర్యాదు చేశారు. పోలీసులు.. ఆ మహిళా కార్యకర్తను పలుమార్లు హెచ్చరించినా...మార్పు రాకపోవడంతో ఇటీవల కేసు కట్టారు. తర్వాత పోలీసులు ఆమెను తీవ్రంగా హెచ్చరించారు.

ఫేక్ ఖాతాపై ఫిర్యాదు

కొందరు ఇటీవల అనంతపురం ఎమ్మెల్యే పేరుపై ఫేక్ అకౌంట్ ఓపెన్ చేసి, దుమారం రేపే కామెంట్స్‌తో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. దీనిని గుర్తించిన ఎమ్మెల్యే దగ్గుపాటి సోషల్ మీడియా టీం సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుట్రలు చేసేందుకే ఇలా ఫేక్ ఖాతాలో కామెంట్స్ పెట్టారంటూ... టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నకిలీ ఖాతా సృష్టించిన, కామెంట్స్ పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి కేసులు ఇటీవలి కాలంలో పెరుగుతున్నాయి. కామెంట్స్ కాస్త... వివాదాలకు తారితీస్తున్నాయి.

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

కలెక్టర్ ఆనందం

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కిందిస్థాయి అధికారుల వద్ద అర్జీల పరిష్కార గడువు దాటకుండా (బియాండ్ ఎస్ఎల్ఏ) చూసుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల నుంచి 325 అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వివిధ శాఖల జిల్లా అధికారులకు సహకారం అందించాలని డీపీఓ, జడ్పీ సీఈఓకు సూచించారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై నెలరోజుల పాటు అవగాహన కల్పించాలని సూచించారు. చాలా శాఖల్లో పీజీఆర్ఎస్‌కు సంబంధించి అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. నెలకు ఒకసారి వ్యవసాయం, సంక్షేమ శాఖలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్వో మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జున, ఆనంద్, రామ్మోహన్, జేడీఏ ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్పీడు అందుకోని రైళ్లు

- అంచనాలకు దూరంగా 'మిషన్ రఫ్తార్'
- వందే భారత్ రైళ్ల వేగాలూ దయనీయమే..!
- వేగానికి తగ్గ సదుపాయాలు లేని స్థితి

7

పెళ్లికి వచ్చి పరలోకాలకు..!

ఈత కోసం వెళ్లి ఇద్దరు కర్ణాటక యువకుల మృతి

7

సిరుల విరులు..!

- బంతిపూల సాగుతో లాభాలు
- పండుగల వేళ పెరిగిన డిమాండ్
- ధరలు బాగుండటంతో అన్నదాత హర్షం

యాడికి, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): బంతిపూల సాగు.. అన్నదాతకు సిరులు కురిపిస్తోంది. పండుగల సీజన్ కావడంతో ధరలు ఆశాజనకంగా లభిస్తున్నాయి. దీంతో లాభాలు గడిస్తున్నాడు మండలంలోని కొట్టాలపల్లికి చెందిన రైతు రామచంద్రారెడ్డి. సీజన్‌కు అనుకూలంగా బంతి పూలు సాగుచేస్తే లాభదాయకమేనని చెబుతున్నాడు. సంప్రదాయ పంటలైన టమోటా, వంగ, బెండ, మొక్కజొన్న తదితరాలను సాగు చేసేవాడినని తెలిపాడు. దసరా ఉత్సవాల నేపథ్యంలో ముందస్తుగా బంతిపూలు సాగు చేశాడు. ప్రస్తుతం డిమాండ్ ఉండడంతో బంతిపూలను హైదరాబాద్‌కు తరలిస్తున్నాడు. సాధారణ రోజుల్లో రైతుల వద్ద బంతిపూలు కిలో రూ.20కి కూడా కొనుగోలు చేయని వ్యాపారులు.. ప్రస్తుతం కిలో రూ.60కి తీసుకుంటున్నారు. ఈ ధరతో రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. పంట సాగు చేసిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంచేసిన పూలు



కొట్టాలపల్లి వద్ద సాగుచేసిన బంతిపూలు

మొక్కలు తెచ్చి..

ఎకరాలో 8వేల నుంచి 10వేల వరకు బంతిపూల మొక్కలు నాటుతారు. రైతు రామచంద్రారెడ్డి చిత్తూరు జిల్లాలోని వి.కోట నుంచి ఒక మొక్క రూ.2.80తో కొనుగోలు చేసి, తీసుకొచ్చాడు. ఎకరాలో 8వేల మొక్కలు నాటాడు. రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. పండుగ సీజన్‌కు దిగుబడి వస్తోంది. రూ.1.50 లక్షల వరకు లాభం వస్తుందని రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

సీజన్‌కు అనుగుణంగా సాగుచేస్తే లాభాలే

సీజన్‌కు అనుగుణంగా బంతిపూలు సాగు చేస్తే మంచి లాభాలు పొందవచ్చు. అధిక దిగుబడులు సాధించాలంటే తగు మెలకువలు పాటించాలి. పంటను జాగ్రత్తగా కాపాడుకోవాలి. పండుగ సమయాల్లో బంతిపూలకు మంచి డిమాండ్ ఉంటుంది. బంతిపూల దిగుబడిని హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తున్నా.

-రామచంద్రారెడ్డి, రైతు, కొట్టాలపల్లి, యాడికి మండలం



అడిగితేనే తగ్గింపు..!

మెడికల్ షాపులలో దోపిడీ
జీఎస్టీ తగ్గింపు ఫలం వ్యాపారుల జేబులోకి..
తనిఖీలు మరిచిన అధికారులు

● హిందూపురం పట్టణంలోని రైల్వేగేటు సమీపంలో ఉన్న ఓ మందుల దుకాణంలో నాగేష్ అనే వ్యక్తి ఐడ్రాప్స్‌ను కొనుగోలు చేశాడు. దానిపై ఎమ్మార్పీ రూ.69 అని ఉంది. ప్రత్యేక రాయితీ పోనూ రూ.50 మాత్రమే తీసుకోవాలి. జీఎస్టీ తగ్గింపు కారణంగా మరో రూ.7 తగ్గించాలి. ఈ లెక్కన రూ.43కు ఇవ్వాలి. కానీ ఎమ్మార్పీ రూ.69 తీసుకున్నాడు దుకాణదారుడు. కొనుగోలుదారుడు ప్రశ్నిస్తే.. అప్పుడు జీఎస్టీ తగ్గించాడు.

● హిందూపురం పట్టణంలోని పెనుకొండ రోడ్డులో ఉన్న మందుల దుకాణంలో చిలమత్తూరుకు చెందిన ఓ వ్యక్తి రూ.1500 మందులు కొనుగోలు చేశారు. ఈ బిల్లు ఎమ్మార్పీ ప్రకారమే వేశారు. కొనుగోలుదారుకు జీఎస్టీ తగ్గింపు గురించి అవగాహన లేదు. అందుకు మొత్తం డబ్బులు చెల్లించారు. ఇంటికి వెళ్లాక ఆయన కుమారుడు గమనించారు. జీఎస్టీ తగ్గింది కదా, బిల్లు తగ్గలేదా అని తండ్రిని ప్రశ్నించారు. 'ఎప్పటిలాగే బిల్లు వేశారు..' అని తండ్రి సమాధానమిచ్చారు. ఆ మందులు వెనక్కు తీసుకువెళ్లి తీసుకొచ్చి ప్రశ్నిస్తే.. అప్పుడు రూ.200 తగ్గించారు. పనిచేసేవారికి తెలియక జీఎస్‌టీ తగ్గించకుండా పాత ధరలు వేశారని వివరణ ఇచ్చాడు దుకాణదారు.

హిందూపురంలోని మెడికల్ షాపులలో జీఎస్టీ తగ్గింపు ఫలాలు రోగులకు కాకుండా, వ్యాపారులకు అందుతున్నాయి అనేందుకు ఈ రెండు దుకాణాలు ఉదాహరణ. దాదాపు అన్నిచోట్లా ఇదే పరిస్థితి ఉందని పట్టణవాసులు అంటున్నారు. జిల్లావ్యాప్తంగా జీఎస్టీ తగ్గింపు అమలు జరిగా లేదు. వైద్యం ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న 'జీఎస్టీ తగ్గింపు' నిర్ణయం క్షేత్రస్థాయిలో సరిగా అమలు కావడం లేదు. బయటి దుకాణాలే కాదు, కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో దుకాణాలలోనూ ఇదే జరుగుతోంది. చాలాచోట్ల బిల్లులు ఇవ్వడం లేదు. తెల్లకాగితంపై రాసిస్తున్నారు. మందులు, సిరప్‌లపై ఎడాపెడా దోచేస్తున్నారు. అత్యవసర, క్యాన్సర్ మందులపై జీఎస్టీ 5, 12శాతం ఉండేది. పూర్తిగా తీసేశారు. ఇవీ అమలు కావడం లేదు. జిల్లా వ్యాప్తంగా 1500 పైగా మందుల దుకాణాలు ఉన్నాయి. నెలకు రూ.150 కోట్ల ఔషధ విక్రయాలు జరుగుతున్నాయి. దోపిడీ కూడా అదే స్థాయిలో ఉంది.

తనిఖీలు మరిచారా..?

కేంద్ర ప్రభుత్వం సవరించిన ధరల ప్రకారం వస్తువులను విక్రయించాలి. ఈ విధానం పూర్తిస్థాయిలో అమలు కావడంలేదు. కేంద్ర జీఎస్టీ అధికారులు, వాణిజ్య పన్నులశాఖ అధికారులు తనిఖీలకు వెళ్లడం లేదు. కొత్త జీఎస్టీపై అవగాహన కల్పించడం లేదు. ఫిర్యాదు చేద్దామంటే టోల్‌ఫ్రీ నంబర్లు, హెల్ప్‌లైన్ డెస్కులను అందుబాటులోకి తీసుకురాలేదు. ఫలితంగా వ్యాపారుల దోపిడీ కొనసాగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

-ఆంధ్రజ్యోతి, హిందూపురం

ఉద్యానంపై ధ్యాస పెట్టేరా..?

కొత్త కలెక్టర్‌పై 'అనంత' ఆశలు..!

ఫిబ్రవరిలో అనంత ఉద్యాన సమ్మేళనం
రాష్ట్రస్థాయిలో మొట్టమొదటగా నిర్వహణ
7 కంపెనీలతో ఒప్పందాలు
నెలలు గడుస్తున్నా.. అడుగు ముందుకు పడని వైనం
కొత్త కలెక్టర్ చొరవపై రైతుల ఆశలు


కలెక్టర్ ఆనంద్


అనంత ఉద్యాన సమ్మేళనంలో జిల్లా యంత్రాంగంతో ఒప్పందం కుదుర్చుకుంటున్న కంపెనీల ప్రతినిధులు (ఫైల్)

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): అనంత ఉద్యాన సమ్మేళనం లక్ష్యాలు నెరవేర్చడంలో జిల్లా నూతన కలెక్టర్ ఆనంద్ చొరవపై అనంత ఉద్యాన రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఉద్యాన రైతులకు మరింత చేయూతనిచ్చేందుకు రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా అనంత ఉద్యాన సమ్మేళనం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలో జిల్లాకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యప్రజాప్రతినిధులతోపాటు పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. 7 కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అనంత ఉద్యాన సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని, ఇతర జిల్లాల్లోనూ నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించడం విశేషం. ఇంత వరకూ బాగానే ఉన్నా.. ఉద్యాన సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంపై శ్రద్ధ పెట్టలేదు. దీంతో ఇప్పటి దాకా ఉద్యాన సమ్మేళనం లక్ష్యం ఒక్క అడుగు ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్‌పై ఉద్యాన రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఉద్యాన సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంపై ప్రత్యేక చొరవ చూపితేనే రైతులకు ప్రయోజనం లభించే అవకాశం ఉంది. లేదంటే కార్యక్రమ లక్ష్యాలు నెరవేరడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కంపెనీలతో ఒప్పందాలివే..

అనంత ఉద్యాన సమ్మేళనంలో 7 కంపెనీలు జిల్లా యంత్రాంగంతో అవగాహన ఒప్పందాన్ని (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. మైక్రో అల్గే సొల్యూషన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ (అల్గా ఎనర్జీ స్పెయిన్ అనుబంధ సంస్థ), సిద్ధార్థ కోల్డ్ కేర్ (అనంతపురం), కోసూరి బాలాజీ ఆగ్రో ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ (కృష్ణా జిల్లా), గ్రీన్ గురుకులం ప్రైవేటు లిమిటెడ్ (తెలంగాణ), ఆగ్రో లైఫ్ సైన్సెస్ కార్పొరేషన్ (న్యూఢిల్లీ), అననా ఫిట్ న్యాచురల్ ఫైబర్ వీవర్ క్లస్టర్, ప్యూర్ ఓ న్యాచురల్ రీటైల్ ప్రైవేటు లిమిటెడ్ (హైదరాబాద్) కంపెనీలు ఉద్యాన పంటల కొనుగోలు, ఎగుమతికి సంబంధించి జిల్లా యంత్రాంగంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి.

ఏడు నెలలవుతున్నా..

రాష్ట్రస్థాయిలో ఎన్నడూలేనివిధంగా జిల్లా కేంద్రంలో ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలో అనంత ఉద్యాన సమ్మేళనం నిర్వహించారు. ఏడు నెలలు కావస్తున్నా.. అందులో తీసుకున్న నిర్ణయాల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదు. అనంతలో పండించిన ఉద్యాన ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసి, జిల్లా రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలన్న ఉద్దేశంతోనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యాన పంటల కోత తర్వాత కూడా ఉద్యాన పంటల వ్యర్థాలతో పలు రకాల వస్తువులు తయారు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఉద్యాన సమ్మేళనంలో గ్రోత్ ఇంజిన్స్ జాబితాలో అరటి, చీనీ, దానిమ్మ, ఎండుమిరప, టమోటా పంటలను ఎంపిక చేశారు. అరటితోపాటు మిగతా పంటల ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాలని నిర్ణయించారు. తొలి అనంత ఉద్యాన సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయాలను క్షేత్ర స్థాయిలో అమలు చేసి, వచ్చే ఏడాది తిరిగి కార్యక్రమాన్ని నిర్వహించాలని తీర్మానించారు. అనంత ఉద్యాన సమ్మేళనంలో ఒప్పందం కుదుర్చుకున్నా.. కంపెనీల ప్రతినిధులతో ఈ ఏడాది మార్చిలో అప్పటి కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఒప్పందం మేరకు చేపట్టాల్సిన పనులపై ప్రణాళికలు తయారు చేసి, క్షేత్రస్థాయిలో పనులు మొదలు పెట్టాలని సూచించారు. ఆయా కంపెనీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పనులు మొదలు పెట్టకపోవడం గమనార్హం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉద్యాన సమ్మేళనం లక్ష్యం నెరవేరడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మైక్రో అల్గే సొల్యూషన్స్

ఈ కంపెనీ బయో ఎరువులు, బయో ఉద్దీపనల కోసం ఆధునాతన మైక్రో అల్గే ఆధారిత సాంకేతికతను సమగ్ర పర్చడంలో పాల్గొంటుంది. జిల్లాలో కనీసం 10వేల మంది రైతులు మైక్రో అల్గే ఆధారిత బయో ఎరువులు, జీవ ఉద్దీపనలను స్వీకరించేలా చొరవ చూపుతుంది. యూపీటీ-ఆధారిత బయో ఇన్‌పుట్‌ల సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు పైలెట్ ప్రాజెక్టును ఏర్పాటు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు.

సిద్ధార్థ కోల్డ్ కేర్

ఈ కంపెనీ పరిధిలో 300 ఎంటీ ప్రీ కూలింగ్ చాంబర్లు, 800 ఎంటీ కోల్డ్ రూమ్‌లు ఉన్నాయి. వీటిని ప్రస్తుతం ఎస్‌కే బనానా ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు అరటి పండ్లను ప్రీ కూల్ చేస్తున్నారు. ఒప్పందం మేరకు సిద్ధార్థ పల్ప్, డీ హైడ్రేషన్ యూనిట్‌ను ఏర్పాటు చేసి పండ్లు, కూరగాయలు తాజాగా ఉండేలా చర్యలు తీసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారు.

కోసూరి బాలాజీ ఆగ్రో ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్

అరటి, మామిడి, సీతాఫలం, ఇతర ఉద్యాన పంటలను ప్రాసెసింగ్ చేయడం జరుగుతుంది. తద్వారా రైతులు ఉద్యాన ఉత్పత్తులను లాభదాయక ధరతో విక్రయించేలా చొరవ చూపేందుకు ఒప్పందం.

గ్రీన్ గురుకులం ప్రైవేటు లిమిటెడ్

ఉద్యాన పంట కోతల అనంతరం తగిన మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. ఇతర ప్రాంతాల్లో ధరలను జిల్లా రైతులకు తెలియజేసి, కొత్త మార్కెటింగ్‌లో మద్దతు ధర లభించేలా చొరవ చూపేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కంపెనీ పంటలకు రెయిన్ ఫారెస్ట్ అలయన్స్ (ఆర్ఎఫ్ఏ) సర్టిఫికెట్ ఇస్తారు. ఈ సర్టిఫికెట్‌తో ప్రపంచంలో ఎక్కడైనా ఆయా పంటలను విక్రయించుకునే అవకాశం ఉంటుంది. పంటల సాగులో ఏయే పద్ధతులు పాటిస్తే ఆర్ఎఫ్ఏ సర్టిఫికెట్ జారీ చేస్తారు..? తదితర అంశాలపై త్వరలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

ఆగ్రో లైఫ్ సైన్సెస్ కార్పొరేషన్

ఉద్యాన పంటల్లో తెగుళ్ల నివారణ కోసం ఏయే దశల్లో క్రిమిసంహారక మందులు వాడాలి. మొక్కల ఎదుగుదల కోసం బయో ఎరువులను రైతులకు అందుబాటులోకి తెస్తారు. జిల్లాలోని 13 సంకల్ప్ రిటైల్ స్టోర్ల ద్వారా తక్కువ ధరలకు ఎరువులను అందజేసేలా ఒప్పందం.

అననా ఫిట్ న్యాచురల్ ఫైబర్ వీవర్ క్లస్టర్

అరటి పంట కోత తర్వాత వ్యర్థాలను తగ్గించేందుకు చర్యలు చేపడతారు. ఈ కంపెనీ ద్వారా అరటి నుంచి వచ్చే నారతో బొమ్మలు, బ్యాగులు, టోపీలు, దుస్తులు తయారు చేసే టెక్నాలజీపై శిక్షణ ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, డీఆర్‌డీఏ, మెప్మా అధికారులతో చర్చించి, షెడ్యూల్ మేరకు ఎంపిక చేసిన డ్వాక్రా సంఘాలకు ఆ కంపెనీతో శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారు.

ప్యూర్ ఓ న్యాచురల్ రీటైల్ ప్రైవేటు లిమిటెడ్

రైతుల నుంచి నేరుగా పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తారు. స్థానిక వ్యవసాయ సంఘాలతో మమేకమై తాజా పండ్లు, కూరగాయలను కొనుగోలు చేసేలా ఒప్పందం.

క్యాన్సర్ బాధితులకు సమగ్ర వైద్యం


హడావుడి తగ్గిన తరువాత శ్రీరాములును వీల్‌చైర్‌పై తీసుకెళ్తున్న సిబ్బంది

(5వ పేజీ తరువాయి)

చికిత్సల ప్రక్రియను బలోపేతం చేశామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో అవగాహన లేని కారణంగా క్యాన్సర్ పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు రావడంలేదన్నారు. ప్రతి యువతి, మహిళ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కియ పరిశ్రమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి కింద ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి అధునాతన సాంకేతిక గుండె శస్త్రచికిత్స యంత్రాలను అందించిందని తెలిపారు. వాటిని వినియోగించి, 100 ఐవీయూఎస్ గైడెడ్, 500 యాంజియోగ్రామ్ ప్లాస్టీ సర్జరీలు చేసి, రోగుల ప్రాణాలను కాపాడిన కార్డియాలజిస్ట్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్, ఆయన బృందాన్ని అభినందిస్తున్నాన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలపై పత్రికల్లో వ్యతిరేక కథనాలు వస్తున్నాయని, ఇందుకు పలురకాల కారణాలున్నాయన్నారు. ఎవరినీ తప్పుపట్టడంలేదని, అలా జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం గుండె శస్త్ర చికిత్సలకు వినియోగించే అధునాతన యంత్రాలు, ఉపకరణాల ప్రదర్శనను మంత్రి తిలకించారు.

రోగులకు ఇబ్బంది..

మంత్రి, అధికారుల రాకతో సూపర్ స్పెషాలిటీలో హడావుడి ఏర్పడింది. ఆస్పత్రి ఆవరణలో అధికారులు, నాయకుల వాహనాలను నిలపడంతో 108 వాహనంలో వచ్చిన రోగిని ఆస్పత్రిలో చేర్పించడం ఆలస్యమైంది. సోమందేపల్లి మండలం నడింపల్లికి చెందిన శ్రీరాములు మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆపరేషన్ అవసరం కావడంతో సర్వజన వైద్యశాల నుంచి సూపర్ స్పెషాలిటీకి 108లో తెచ్చారు. మంత్రి వెళ్లిపోయి, హడావుడి తగ్గిన తరువాత వీల్ చైర్ తెచ్చి ఆస్పత్రిలోకి తరలించారు.

డ్రైవర్ జోరు

హృదయ దినోత్సవం ముగిశాక ఆస్పత్రి ఆవరణలో మంత్రి పలువురి నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం వాహనం ఎక్కి బయలుదేరారు. ప్రొటోకాల్ వాహనాల్లో రెండు వెంటనే వెళ్లిపోగా, మూడో వాహన డ్రైవర్ హడావుడి చేశారు. త్వరగా వెళ్లే క్రమంలో అక్కడున్న వాహనాలను ఢీకొడుతూ, రాసుకుంటూ దూసుకుపోయారు. దీంతో బీజేపీ నాయకుడు చిరంజీవి రెడ్డి వాహనం, కలెక్టర్ వాహనం దెబ్బతిన్నాయి.


కలెక్టర్ కారును ఢీకొట్టి వెళుతున్న కాన్వాయ్ వాహనం

రేగడి రెడీ

(5వ పేజీ తరువాయి)

పెంచేసి సొమ్ము చేసుకుంటున్నారు. తాడిపత్రి, ఉరవకొండ నియోజకవర్గాల్లోని ఎరువుల దుకాణాల్లో పక్షం రోజుల క్రితం డీఏపీ బస్తా రూ.1400 నుంచి రూ.1450 వరకు విక్రయించారు. మూడు రోజుల నుంచి డీఏపీ బస్తా రూ.1500 నుంచి రూ.1600దాకా వసూలు చేస్తున్నట్లు సమాచారం. కొందరు రైతులు ముందస్తుగానే డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేసుకున్నారు. రైతులు నల్లరేగడి పొలాల్లో దుక్కిలో వేసుకునేందుకు డీఏపీ కోసం వెళ్లగా స్టాక్ లేదని చెబుతుండడంతో అవాక్కవుతున్నారు. తాడిపత్రి, నల్లరేగడి భూములున్న ఇతర ప్రాంతాల్లో కొందరు డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి, మరింత అధిక ధరకు డీఏపీ విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో డీఏపీ బదులుగా కొందరు రైతులు 20-20-0-13, మరికొందరు ఎక్కువ ధర అయినప్పటికీ 14-35-14 రకం ఎరువులు వేసుకుంటున్నారు.

పప్పుశనగ విత్తేందుకు సిద్ధంగా ఉన్నా

28 ఎకరాల్లో పప్పుశనగ పంట విత్తేందుకు సిద్ధంగా ఉన్నా. ఈసారి రబీ సీజన్‌కు ముందే బాగా వర్షాలు రావడంతో సేద్యం పనులు చేసుకున్నా. డీఏపీని సైతం వేశా. మరోసారి వర్షం పడితే విత్తనం వేసేస్తాం. గతేడాది వర్షాభావంతో దిగుబడి సరిగా రాలేదు. ఈ సారైనా దిగుబడులు వస్తాయన్న ఆశతో ఉన్నాం. దేవుడిపై భారం వేసి, పప్పుశనగ విత్తనం వేస్తాం.



-తిరుపతయ్య, తగ్గుపర్తి, బెళుగుప్ప మండలం

సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నాం

ఏటా రబీ సీజన్‌లో పప్పుశనగ పంటనే సాగు చేస్తున్నా. ఈసారి 10 ఎకరాల్లో పంట పెట్టేందుకు పొలాన్ని సిద్ధం చేసుకున్నా. పదును వర్షం పడితే విత్తనం వేసేందుకు సిద్ధంగా ఉన్నా. ప్రభుత్వం అందించే సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నా. చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీ విత్తనాలు ఎంతగానో ఉపయోగపడతాయి. గతేడాది తరహాలోనే రబీ సీజన్ ప్రారంభంలోనే సబ్సిడీ పప్పుశనగ విత్తనాలు అందించి ప్రభుత్వం ఆదుకుంటే బాగుంటుంది.



- శ్రీరాములు, బెళుగుప్ప

పప్పుశనగ సబ్సిడీ ధర ఖరారు

క్వింటం పూర్తి ధర రూ.7,800
25 శాతం సబ్సిడీతో రైతుకు ఇచ్చే ధర రూ.5,850

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పప్పుశనగ సబ్సిడీ ధరను ప్రభుత్వం ఎట్టకేలకు ఖరారు చేసింది. పప్పుశనగ జేజీ-11 రకం క్వింటా పూర్తి ధర రూ.7800గా నిర్ణయించింది. ఇందులో 25 శాతం సబ్సిడీపోను రైతు వాటా కింద క్వింటాకి రూ.5,850 చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో రైతుకు ఐదు ఎకరాల దాకా గరిష్ఠంగా 10 బస్తాల (బస్తా 20 కేజీలు) పప్పుశనగ పంపిణీ చేయాలని నిర్ణయించారు. దసరా పండుగ తర్వాత రైతు సేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టే అవకాశం ఉన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

పెద్దగా తేడా లేదు..

రైతు సేవాకేంద్రాల ద్వారా ప్రభుత్వం సబ్సిడీతో అందించే పప్పుశనగ క్వింటాల్ ధర రూ.5,850గా నిర్ణయించింది. జిల్లాలో బహిరంగ మార్కెట్‌లో ధరతో పోలిస్తే పెద్దగా తేడా లేకపోవడం గమనార్హం. తాడిపత్రి నియోజకవర్గంలో క్వింటాల్ పప్పుశనగ రూ.5,900 నుంచి రూ.6వేలలోపు ఉంది. బెలుగుప్ప మండలంలో రూ.6వేలకు దొరుకుతోంది. మిగిలిన నల్లరేగడి భూములున్న ప్రాంతాల్లోనూ ప్రభుత్వం సబ్సిడీతో పోలిస్తే పెద్దగా తేడా లేకపోవడంతో ఇదెక్కడి చోద్యం అంటూ నిట్టూరుస్తున్నారు.

పుట్టపర్తికి గ్లోబల్ గౌరవం

ప్రపంచ హృదయ దినోత్సవానికి ఆతిథ్యం
సత్యసాయి శత జయంతి వేళ గొప్ప గౌరవం
ప్రపంచ హృదయ సమాఖ్య నిర్ణయంపై సర్వత్రా హర్షం


వివిధ ఆకృతుల్లో సత్యసాయి విద్యార్థులు


మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణారావు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల వేళ పుట్టపర్తికి గ్లోబల్ గౌరవం దక్కింది. ప్రపంచ హృదయ సమాఖ్య (డబ్ల్యూహెచ్ఎఫ్) చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాదికిగాను ప్రపంచ హృదయ దినోత్సవాలను ప్రశాంతి నిలయాన్ని ఎంపిక చేసి, నిర్వహించింది. సోమవారం ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా డబ్ల్యూహెచ్ఎఫ్ అధ్యక్షుడు జగత్ నరులా ఈ విషయాన్ని ప్రకటించారు. ఇది భారతదేశానికి లభించిన అరుదైన గౌరవం. శతాబ్దంపాటు మానవాళి హృదయాలను ప్రేమతో, సేవతో, ఆధ్యాత్మిక బోధనలతో ప్రేరేపించిన సత్యసాయిబాబాకు దక్కిన అత్యున్నత గౌరవం.

దేశానికి దక్కిన గౌరవం

ప్రపంచ హృదయ సమాఖ్య ఇప్పటి వరకు ఏ భారతీయ నగరానికి ఈ గ్లోబల్ వేడుకలకు ఆతిథ్యం ఇచ్చే అవకాశం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో పుట్టపర్తికి అవకాశం కల్పించడం వెనుక ఆరోగ్యశాస్త్రం, సేవా భావం, ఆధ్యాత్మికత అనే మూడు అంశాలు ఉన్నాయని డబ్ల్యూహెచ్ఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ జగత్ నరులా పేర్కొన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా పుట్టపర్తిలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జగత్ నురులా మాట్లాడుతూ.. సత్యసాయి బాబా సేవాస్ఫూర్తి వైద్యానికి కొత్తమార్గాలను చూపుతోందన్నారు. ప్రశాంతి నిలయంలో ఉన్న శాస్త్రం, సేవ, ఆధ్యాత్మికతల సమన్వయం ప్రపంచానికి ఆదర్శం అన్నారు. ఇక్కడి వాతావరణం, సత్యసాయిబాబా ప్రసాదించిన సేవాభావం, ఈ వేడుకలకు ఒక ప్రత్యేక పౌర్ణమి వెలుగునిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

అబ్బురపరిచేలా..


హిల్‌వ్యూ స్టేడియంలో సత్యసాయి విద్యార్థుల ప్రదర్శనలు అబ్బురపరిచాయి. సత్యసాయి శతజయంతి గౌరవార్థం 100, ప్రపంచ హృదయ దినోత్సవం 25వ వార్షికోత్సవానికి గుర్తుగా 25, ప్రపంచ హృదయ సమాఖ్య లోగో, చివరిగా ఆరోగ్యంగా కొట్టుకునే హృదయం ఆకారంలో కూర్చుని, విద్యార్థులు అబ్బురపరిచారు. ప్రపంచ హృదయ దినోత్సవాలతోపాటు శ్రీసత్యసాయి గ్లోబల్ కార్డియో వాస్క్యులర్ సింపోజియం కూడా ప్రారంభమైంది. ఈ సింపోజియంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ వైద్యనిపుణులు, ప్రజారోగ్య శాస్త్రవేత్తలు, ఆరోగ్య విధానకర్తలు, సేవాసంస్థల ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

హృదయ ఆరోగ్యంపై ఆందోళన

ప్రపంచవ్యాప్తంగా ఏటా కోట్లాదిమంది హృద్రోగాలతో ప్రాణాలు కోల్పోతున్నారు. అధిక రక్తపోటు, అనారోగ్యకర ఆహారం, వ్యాయామంలేమి, ధూమపానం, అధిక ఒత్తిడి ఇందుకు ప్రాధాన కారణాలు అని డబ్ల్యూహెచ్ఎఫ్ వివరిస్తోంది. ఈ నేపథ్యంలో సమాఖ్య ఈ ఏడాదికి 'డోంట్ మిస్ ఎ బీట్.. యూజ్ హార్ట్ ఫర్ యాక్షన్..' అనే నినాదంతో పనిచేయనుంది. సరైన ఆహారం, రోజువారీ వ్యాయామం, ధూమపానం మానుకోవడం, ఒత్తిడి తగ్గించడం తదితర సాధారణ మార్పులే ప్రాణాలను కాపాడగలవని నిపుణులు వివరించారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్ఎఫ్ ప్రతినిధి డాక్టర్ కృష్ణారావు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మిస్ బోర్జినా పెన్వాన్, పద్మభూషణ్ డాక్టర్ వీ మోహన్, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ నీలందేశాయి, యూనివర్సిటీ వీసీ డాక్టర్ రాఘవేంద్రప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కన్నా, వివిధ దేశాలకు చెందిన ప్రముఖ హృద్రోగ నిపుణులు, సత్యసాయి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి..!

పేట్రేగిపోతున్న మాఫియా..!.. జోరుగా అక్రమ రవాణా
వరుసగా పట్టుబడుతున్నా.. తగ్గని వైనం


ధర్మవరం మార్కెట్ యార్డులో ఉంచిన పట్టుబడిన బియ్యం (ఫైల్)

ధర్మవరంరూరల్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రేషన్ బియ్యం మాఫియా పేట్రేగిపోతోంది. పేదలకు అందాల్సిన బియ్యం.. నిత్యం అక్రమ రవాణా చేస్తోంది. వరుసగా అధికారులకు పట్టుబడుతున్నా.. అక్రమ రవాణా మాత్రం ఆగట్లేదు. పేదల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, అడ్డదారుల్లో సరిహద్దులు దాటించి, కర్ణాటకలో విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఇటీవల విజిలెన్స్, పోలీసుల తనిఖీల్లో భారీగా రేషన్ బియ్యం పట్టుబడడాన్ని బట్టి జిల్లాలో అక్రమ రవాణా ఏ స్థాయిలో సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. అధికారుల కళ్లుగప్పి భారీ మొత్తంలో నిత్యం రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

స్టాక్ పాయింట్‌కు 100 టన్నులు

ఇటీవల పట్టుబడిన రేషన్ బియ్యాన్ని ధర్మవరం మార్కెట్ యార్డులోని స్టాక్ పాయింట్‌కు తరలించారు. ఒక్క ధర్మవరం నియోజకవర్గంలోనే రెండునెలల వ్యవధిలో 100 టన్నుల వరకు రేషన్ బియ్యం పట్టుబడినట్లు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏ స్థాయిలో అక్రమంగా రవాణా చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

కర్ణాటకకు తరలిస్తూ..

ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి మాఫియా సేకరించిన రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. బెంగళూరు, బళ్లారి, చిక్‌బళ్లాపూర్ తదితర ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. అక్కడ రీసైక్లింగ్ చేసి, సన్నబియ్యంగా మార్చి విక్రయించి, పెద్దఎత్తున అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు మేల్కొని, బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని జనం కోరుతున్నారు.

అక్రమాలపై చర్యలు తీసుకుంటున్నాం

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై దాడులు చేసి, కేసులు నమోదు చేస్తున్నాం. కర్ణాటకకు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సరిహద్దు ప్రాంతాల్లో గట్టి నిఘా ఉంచాం. బియ్యం అక్రమ రవాణా నివారణకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం.

- వైబీపీపీఏ ప్రసాద్, ఉమ్మడి జిల్లా విజిలెన్స్ అధికారి

స్పీడు అందుకోని రైళ్లు

- అంచనాలకు దూరంగా 'మిషన్ రఫ్తార్'
- వందే భారత్ రైళ్ల వేగాలూ దయనీయమే..!
- వేగానికి తగ్గ సదుపాయాలు లేని స్థితి

గుంతకల్లు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రైళ్ల వేగాలను పెంచడానికి కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మిషన్ రఫ్తార్' అంచనాలను అందుకోలేకపోతోంది. ప్రయాణికుల రైళ్లు, గూడ్సు రైళ్ల సగటు వేగాన్ని 25 కి.మీ.ల మేర పెంచడానికి దాదాపు పదేళ్ల కిందట మిషన్ రఫ్తార్ పేరుతో పంచవర్ష ప్రణాళికను కేంద్రం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా డీఆర్ఎంలు, సాంకేతిక సిబ్బందిని ఇటలీ, ఆస్ట్రేలియా, జపాన్ దేశాలకు పంపి అక్కడ వేగంగా నడుస్తున్న రైళ్లు, రైల్వే వ్యవస్థపై అవగాహన కల్పించారు. భారత రైల్వేలోనూ 150 కి.మీ.ల వేగాన్ని సాధించాలన్న లక్ష్యంతో లక్షల కోట్ల రూపాయలు వెచ్చించారు. ఈక్రమంలోనే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి, అధునాతన రైళ్లను ప్రవేశపెట్టడం, ట్రాక్ రెన్యువల్, డబ్లింగ్, ట్రిపుల్ లైన్ల నిర్మాణం, లైన్ల విద్యుద్దీకరణ, పాత తరం ఐసీఎఫ్ కోచ్‌ల స్థానంలో ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను తేవడం, డీజల్ ఇంజన్ల స్థానంలో విద్యుత్తు రైళ్లను ప్రవేశపెట్టారు. ఇన్ని మార్పులు చేసినా అనుకున్న లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేకపోతున్నారు.

లక్ష్యం ఇలా..

2016-17 ఆర్థిక సంవత్సర రైల్ బడ్జెట్‌లో అప్పటి రైల్వే మంత్రి మిషన్ రఫ్తార్ పేరిట రైళ్ల వేగాలను పెంచడానికి పథకాన్ని ప్రకటించారు. అప్పట్లో ప్రయాణికులను చేరవేసే రైళ్ల సగటు వేగం గంటకు 46.3 కి.మీ.లు ఉండగా, గూడ్సు రైళ్ల సరాసరి వేగాలు 24.2 కి.మీ.లుగా ఉండేవి. ఎక్స్‌ప్రెస్ రైళ్లను సగటున గంటకు 75 కి.మీ.ల వేగాన్ని, గూడ్సు రైళ్లను సగటున 50 కి.మీ.ల వేగంతో నడపడానికి సంకల్పించారు. అప్పటినుంచి పలు రూట్లలో లైన్లను డబుల్/ట్రిపుల్ చేయడం, విద్యుద్దీకరించడం చేశారు. రైల్ ట్రాక్‌ను రీప్లేస్ చేశారు. దాదాపు 98 శాతం లెవెల్ క్రాసింగ్‌లను తొలగించారు. పలు జంక్షన్లలో బైపాస్ లైన్లను నిర్మించారు. వందే భారత్, హంసఫర్ ఎక్స్‌ప్రెస్ లాంటి అధునాతన రైళ్లను తెచ్చారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో వాడి-గుంతకల్లు-తిరుపతి రూటులో రైళ్లను 130 కి.మీ.ల వేగంతో టెస్ట్ రన్ చేశారు. కొన్నాళ్లు రైళ్లను ఆ వేగంతో నడిపారు కూడా. కానీ కార్యాచరణలో పరిమితులు అర్థమై 130 కి.మీ.ల వేగం అనే మాటను పలకడం మానేశారు. అంచనాల ప్రకారం ఎక్స్‌ప్రెస్ రైళ్ల సగటు వేగాలను గంటకు 75 కి.మీ. లక్ష్యం ఉండగా ఆచరణలో మాత్రం సగటు వేగాలను 60 కి.మీ.లను దాటించలేకపోయారు. డివిజన్ మీదుగా వెళ్లే దురంత ఎక్స్‌ప్రెస్‌ల వేగాలు దయనీయంగా ఉన్నాయి. అతి వేగంగా వెళ్లే బెంగళూరు-హజ్రత్ నిజాముద్దీన్ (ఢిల్లీ) వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్ సగటు వేగం సైతం 71 కి.మీ.లుగా ఉండటాన్ని బట్టి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వందే భారత్ రైలు మాత్రమే సగటున 74 కి.మీ.లో లక్ష్యానికి కాస్త దగ్గరగా నడుస్తోంది.

వాస్తవ పరిస్థితులివీ..

దేశంలో 1.35 లక్షల కి.మీ.ల పొడవు కలిగిన రైల్ ట్రాక్ 150 కి.మీ.లు కాదుకదా కనీసం 130 కి.మీ.ల వేగంతో నడిచే స్థాయి నాణ్యతలో లేకపోవడం ఈ వైఫల్యానికి ఓ కారణంగా చెప్పవచ్చు. గడచిన పదేళ్ల కాలంలో కొత్త లైన్ల నిర్మాణం, ట్రాక్ రెన్యువల్స్ మొత్తం ట్రాక్ నిడివితో పోలిస్తే 20 శాతానికి మించదు. దేశ జనాభాకు తగినట్లు రైళ్ల సంఖ్యను పెంచాల్సి వస్తుండటంతో రైళ్ల వేగాలను పెంచలేని పరిస్థితి కూడా నెలకొని ఉంది. కొన్ని హైస్పీడ్ రైళ్లను నడపాలంటే మరెన్నో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ట్రాక్ సరిగా లేని కారణంగా అతి వేగంతో రైళ్లను నడిపితే ప్రమాదాలకు దారితీసే పరిస్థితులున్నాయి. ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అధునాతనమైన లింక్ హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) కోచ్‌లను సమకూరుస్తున్నా, పెరంబూరులో తయారవుతున్న పాతతరం ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) కోచ్‌లను పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఇంకా వినియోగిస్తున్నారు. ఈ పాతతరం కోచ్‌లు ఎక్కువ బరువుగా ఉండి, వేగంగా నడిచే సామర్థ్యం లేకపోవడం కూడా రైళ్ల వేగానికి బ్రేక్‌గా భావించాలి. విదేశాల్లో వేగంగా వెళ్లే రైళ్లకు ఆటోమేటిక్ డోర్ సిస్టం ఉంటుంది. మన దేశంలో వందేభారత్, మెట్రో, సబ్‌వే రైళ్లకు మాత్రమే అలాంటి సదుపాయం ఉంది. కొత్త ఎల్‌హెచ్‌బీ కోచ్‌లలో కూడా ఆటోమేటిక్ డోర్ వ్యవస్థ లేకపోవడంతో ప్రయాణికుల భద్రత కోసం రైళ్లను వేగంగా నడపడం సాధ్యం కావడం లేదు. పైగా హైస్పీడ్ రైళ్ల నిర్వహణ అత్యంత ఖర్చుతో కూడుకున్నది. దీంతో చార్జీలు పెరిగి సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయే ప్రమాదం ఉంది.



పరిమితులున్నా..

ఇన్ని పరిమితుల కారణంగా మిషన్ రఫ్తార్ కార్యక్రమం లక్ష్యాన్ని అందుకోలేకపోతోంది. అయితే గత కొన్నేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనుల వల్ల 46 కి.మీ.ల సగటు వేగంతో వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇప్పుడు దాదాపు 60 కి.మీ.ల సగటుతో వెళ్లగలుగుతున్నాయి. మూడు వందల కి.మీ.ల దూరం ప్రయాణించే రైళ్ల ప్రయాణ కాలం దాదాపు 2 గంటల ఆదా అవుతోంది. దీని వల్ల పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల గమ్యస్థానాలను పెంచగలిగారు. ప్రయాణికుల ఆక్యుపెన్సీ పెరిగిన కారణంగా పలు రైళ్ల ఫ్రీక్వెన్సీ కూడా పెంచారు. వారపు రైళ్లను బైవీక్లీ రైళ్లుగా మార్చడం, బై వీక్లీ రైళ్లను ట్రైవీక్లీ రైళ్లుగా అప్‌గ్రేడ్ చేయడం, మరికొన్నింటిని డెయిలీ రైళ్లుగా మార్చారు. అంచనాల మేరకు కాకున్నా మిషన్ రఫ్తార్ వల్ల కొంతమేర ప్రయోజనం చేకూరింది.



ఈ నెల 27న అనంతలో రైలు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

కొన్ని రైళ్ల వివరాలు

ఎక్స్‌ప్రెస్/ సూపర్ ఫాస్ట్ రైలు	ప్రయాణ సమయం	ప్రయాణ హాల్టులు	దూరం	సగటు వేగం
1. బెంగళూరు-హజ్రత్ నిజాముద్దీన్ (ఢిల్లీ) రాజధాని ఎక్స్‌ప్రెస్ (22691)	33-30 గంటలు	14	2,367 కి.మీ.	71 కి.మీ.
2. తిరుపతి-జమ్మూతావి హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (22705)	44-50 గంటలు	12	2,985 కి.మీ.	67 కి.మీ.
3. చెన్నై-ముంబై సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12164)	21-30 గంటలు	24	1,261కి.మీ.	59 కి.మీ.
4. తిరుపతి-నిజామాబాద్ రాయలసీమ ఎక్స్‌ప్రెస్ (12793)	15-55 గంటలు	26	893 కి.మీ.	56 కి.మీ.
5. కలబురగి (గుల్బర్గ)-బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (22232)	4-25 గంటలు	3	266 కి.మీ.	60 కి.మీ.
6. కాచిగూడ-యశ్వంతపూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20703)	8-15 గంటలు	4	612 కి.మీ.	74 కి.మీ.
7. మైసూరు-జైపూర్ ఎక్స్‌ప్రెస్ (12975)	36-05 గంటలు	34	2035 కి.మీ.	56 కి.మీ.
8. మైసూరు-వారణాసి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22687)	48-55 గంటలు	32	2707 కి.మీ.	51 కి.మీ
9. బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18464)	29-10 గంటలు	44	1,548 కి.మీ.	53 కి.మీ.
10. మైసూరు-బాగల్‌కోట్ బసవ ఎక్స్‌ప్రెస్ (17808)	21-40 గంటలు	36	1,018 కి.మీ.	47 కి.మీ.

నియోజకవర్గానికో బ్రాంచ్

డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు



సభలో మాట్లాడుతున్న నెట్టెం వెంకటేశులు, పక్కన కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గానికో బ్రాంచ్, గోడౌన్‌లు ఏర్పాటు చేసి రైతులకు సేవలందిస్తామని డీసీఎంఎస్ (అనంతపురం ఉమ్మడి జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ) చైర్మన్ నెట్టెం వెంకటేశులు తెలిపారు. సోమవారం స్థానిక కమలానగర్‌లోని డీసీఎంఎస్ కార్యాలయంలో మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ రిపోర్టును ప్రవేశపెట్టారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరం వ్యాపార ప్రగతిని ఆయన సమీక్షించారు. రైతులకు ఇబ్బంది లేకుండా నాణ్యమైన ఎరువులు సబ్సిడీ ధరలకు అందజేస్తామని తెలిపారు. ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని సొసైటీలను సంస్థాగతంగా బలోపేతం చేస్తామని, సొసైటీల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మునికృష్ణారెడ్డి, డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ విజయ్‌భాస్కర్, అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, అకౌంట్స్ అధికారి సుధాకర్‌రెడ్డి, ఏపీ రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్‌సీ పరమేష్, ఉమ్మడి జిల్లాలోని సొసైటీల చైర్మన్లు పాల్గొన్నారు.

సొసైటీల స్థలాలను కాపాడుకోవాలి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సొసైటీల స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘాల (ప్యాక్స్) చైర్మన్లు సోమవారం తెలిపారు. ఈమేరకు వారు ఏడీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు ముంటిమడుగు కేశవరెడ్డి, నెట్టెం వెంకటేశులును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా సహకార శాఖ అధికారి అరుణకుమార్, డీఎల్‌సీఓ వెంకటరామిరెడ్డిలను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

ఏడు వికెట్లతో చెలరేగిన ధనుష్



ధనుష్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తపోవనం క్రికెట్ అకాడమీ జట్టు బౌలర్ ధనుష్ ఏడు వికెట్లు పడగొట్టి తన జట్టును గెలిపించాడు. హిందూపురంలో సోమవారం జరిగిన అండర్-15 జిల్లాస్థాయి ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఎంవైసీఏ అకాడమీ జట్టును తపోవనం క్రికెట్ అకాడమీ జట్టు 120పరుగుల భారీ తేడాతో ఓడించింది. టీసీఏ బౌలర్ ధనుష్ 4ఓవర్లలో 8 పరుగులు మాత్రమే ఇచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. దీంతో టీసీఏ జట్టు సెమీఫైనల్‌కు చేరింది.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): డిగ్రీ, పీజీ చదువుతున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సాధికారత అధికారి రెడ్డి బాలాజీ సోమవారం ఓప్రకటనలో కోరారు. రెన్యువల్, ఫ్రెష్ ఉపకార వేతనాలకు ఈనెల 30లోగా దరఖాస్తు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. ఈప్రక్రియను స్థానిక సచివాలయాల్లో పరిశీలన చేసుకోవాలని ఆయన సూచించారు.

హక్కుల సాధనే ధ్యేయం

ఏపీఎన్‌జీఓ సభ్యత్వ నమోదులో ఉద్యోగ సంఘాల నేతలు



మాట్లాడుతున్న చంద్రశేఖర్ రెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): 'ఏ ప్రభుత్వానికి మనం తొత్తులు కాదు. హక్కుల సాధనే ధ్యేయంగా ముందుగా సాగాలి' అని పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నేతలు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీఓ హోంలో సోమవారం ఏపీఎన్‌జీఓ సంఘం సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఎన్జీఓ నగర అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌బాబుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, ఏపీఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కుల మాధవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హృదయరాజు మాట్లాడుతూ ఉద్యోగులందరూ ఐక్యతగా సభ్యత్వం తీసుకోవడంతోనే ఏపీఎన్‌జీఓ విస్తరణ అవుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో హక్కుల సాధన కోసం లక్ష మంది ఉద్యోగులు ఉద్యమానికి శ్రీకారం చుడితే జగన్ పోలీసులతో అణచివేశాడన్నారు. అదే చంద్రబాబు అయితే ఉద్యోగులను చర్చలకు పిలుస్తాడన్నారు. హక్కుల సాధన కోసం అక్టోబరులో నిర్వహించే ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు.న్నారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు ఏపీ సాధించాలన్న ఏపీఎన్‌జీఓ తోనే సాధ్యమన్నారు. ఏపీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం సంఘంలో మెంబర్‌షిప్ తీసుకుని సంఘటితంగా పోరాటం చేయాలన్నారు. నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నగరశాఖ ఆధ్వర్యంలో భారీగా సభ్యత్వ నమోదు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం శుభపరిణామమన్నారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి సభ్యత్వాలను తీసుకున్నారు. సమావేశంలో ఏపీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్ జమీలా బేగం, కమర్షియల్ ట్యాక్స్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్‌బాబు, అగ్రికల్చర్ ఎంప్లాయీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఆర్టీసీ ఎంప్లాయీస్ చైర్మన్ సూరిబాబు, ఎస్టీయూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారుల రక్షణే ప్రథమ కర్తవ్యం: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మహిళలు చిన్నారుల రక్షణే ప్రథమ కర్తవ్యంగా పోలీసులు పని చేస్తున్నారని ఎస్పీ సతీష్‌కుమార్ సోమవారం ఓప్రకటనలో తెలియచేశారు. గత ఏడాది జూన్ నుంచి ఈఏడాది సెప్టెంబరు వరకు 110 కేసులు నమోదుకాగా అందులో 79 పోక్సో, మిగిలిన 31 మిస్సింగ్ కేసులుగా నమోదై తర్వాత పోక్సో కేసులుగా మారాయన్నారు. రామగిరి మండలం పోక్సో కేసుకు సంబంధించి నిందితులను జైలుకు పంపినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. పోలీసులు న్యాయం చేస్తారనే నమ్మకంతోనే బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదులు చేస్తున్నట్లు తెలిపారు. పోక్సో కేసుల విషయంలో అసత్యప్రచారాలు సరికాదన్నారు.

సెక్టోరల్స్ జాబితా విడుదల

అనంతపురంవిద్య, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పడింది. ఎన్నో వివాదాలు, అభ్యంతరాలతో ఏడాదికిపైగా నాన్చుతూవచ్చిన సమగ్రశిక్షలో సెక్టోరల్స్ ఎంపిక పూర్తయ్యింది. ఆమేరకు ఎంపికైన సెక్టోరల్స్ జాబితాకు కమిషనర్ విజయరామరాజు ఆమోదం వేసి పంపగా, డీఈఓ ప్రసాద్‌బాబు జాబితాను ప్రకటించి సోమవారం ఆర్డర్లు ఇచ్చారు.

ఎంపికైన వారు వీరే..

ఐఈఆర్టీ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో పెండింగ్ పెట్టారు, ప్రస్తుతం ఐదుసెక్టోరల్స్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసి ప్రకటించారు. అందులో ఏఎస్ఓగా ఎన్. నరసింహారెడ్డి(పిజిక్స్‌టీచర్,దేవగిరి జడ్పీహెచ్ఎస్), అసిస్టెంట్ సీఎంఓగా కె.చంద్రశేఖర్(ఎంపీపీస్కూల్, యర్రగుంట్ల, గార్లదిన్నె), ఏఎంఓగా పి.వేణుగోపాల్ (జడ్పీహెచ్ఎస్, గోనబావి), అలెస్కోగా కె.రామచంద్ర (పీఎస్‌హెచ్ఎం, రాయలప్పదొడ్డి), బి.నారాయణస్వామి (ఎంపీపీఎస్, కోటంక, గార్లదిన్నె) నియమితులయ్యారు.

4న కులగణనపై జిల్లాస్థాయి సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి

అనంతపురం విద్య, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జనగణనతోపాటే రాష్ట్రంలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ అక్టోబరు 4న జిల్లాస్థాయి సదస్సు ఏర్పాటు చేసినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాఫర్ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం వారు నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా 5 నుంచి 15శాతంలోపు ఉన్న అగ్రకులాలే రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నాయన్నారు. 50నుంచి 70 శాతం ఉన్న బీసీ కులాలు చిన్నచిన్న పదవులకే పరిమితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీకులాలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికే అక్టోబరు4న జిల్లాస్థాయి సదస్సు రాయల్ పంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐనాయకులు రాజారెడ్డి, మల్లికార్జున, సంజీవప్ప, శ్రీరాములు, కేశవరెడ్డి, గోవిందు, రంగయ్య, కుళ్లాయిస్వామి, పార్వతి, ప్రసాద్ పాల్గొన్నారు.

పెళ్లికి వచ్చి పరలోకాలకు..

ఈత కోసం వెళ్లి ఇద్దరు కర్ణాటక యువకుల మృతి



బాబ్జాన్, మున్వర్‌బాషా మృతదేహాలు

మడకశిర టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహానికి హాజరైన కర్ణాటకకు చెందిన ఇద్దరు యువకులు స్విమ్మింగ్‌లో మునిగి మృతి చెందిన సంఘటన సోమవారం మడకశిరలో జరిగింది. బంధువులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం హాసన్‌కు చెందిన బాబ్జాన్(35) మున్వర్ బాషా(27) మడకశిరలో ఆదివారం జరిగిన తమ బంధువుల వివాహానికి హాజరయ్యారు. పెళ్లి కార్యక్రమం ముగిసిన మరుసటి రోజు సోమవారం సరదాగా సమీపంలోని అక్కంపల్లి వద్ద ఉన్న స్విమ్మింగ్ పూల్ వద్దకు ఈతకు వెళ్లారు. అక్కడ యువకులతో పాటు బంధువులు సరదాగా దాదాపు గంటసేపు ఈత కొట్టారు. బంధువుల్లో చాలా మంది స్విమ్మింగ్‌పూల్ నుంచి బయటకు వెళ్లిపోయినా బాబ్జాన్, మున్వర్‌బాషా అలాగే ఈత కొడుతూ ఉండిపోయారు. అయితే ఉన్నట్లుండి ఇద్దరూ మునిగిపోయారు. అక్కడే ఉన్న బంధువులు ఇది గమనించి, సరదాగా మునిగారేమోనని మిన్నకుండిపోయారు. ఐదారు నిమిషాలు గడిచినా బయటకు రాకపోవడంతో వారు స్విమ్మింగ్‌పూల్‌లోకి దిగి ఇద్దరినీ బయటకు తెచ్చారు. అప్పటికే కడుపు ఉబ్బి ఇద్దరూ మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని, మృతదేహాలను ఆస్పత్రికి తరలించినట్లు సీఐ నాగేష్ బాబు తెలిపారు. కాగా బాబ్జాన్ డ్రైవర్‌గా పని చేస్తుండగా, మున్వర్ బాషా కూలీగా పని చేసేవాడని బంధువులు తెలిపారు. బాబ్జాన్‌కు వివాహం కాగా, మున్వర్ బాషా అవివాహితుడని వెల్లడించారు.

ఆర్డీటీని ఇబ్బంది పెట్టడం సరికాదు: సీపీఐ



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న రామకృష్ణ, నాయకులు

బత్తలపల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఇబ్బంది పెట్టడం సరికాదని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. స్థానిక ఆర్డీటీ ఆస్పత్రిని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న రోగులు, ప్రజలతో ఆర్డీటీ సేవలపై ఆరా తీశారు. 1969 నుంచి ఆర్డీటీ సంస్థ తన సేవలతో ఉమ్మడి జిల్లాలో ఒక మినీ ప్రభుత్వంలా పని చేసిందన్నారు. అలాంటి సంస్థకు మతాన్ని అంటగట్టి ఇబ్బంది పెట్టడం తగదన్నారు. విద్యా, వైద్యం ద్వారా ఎన్నో పేద కుటుంబాలకు ఊరట కలిగించిందన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌లు స్పందించి ప్రధాని మోదీ, హోంమంత్రి అమిషాలపై ఒత్తిడి తెచ్చి ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి వేమయ్య, నాయకులు మధు, కాటమయ్య జింకా చలపతి, కాటమయ్య, వెంకటేసు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

ఫ్యాప్టో రాష్ట్ర కో చైర్మన్ హృదయరాజు



చలో విజయవాడ పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హృదయరాజు, ఫ్యాప్టో నేతలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం అక్టోబరు 7న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్ హృదయరాజు పిలుపునిచ్చారు. చలో విజయవాడ పోరుబాట సన్నాహక కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం అనంతపురం వచ్చారు. ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా ఫ్యాప్టో(ఉపాధ్యాయసంఘాలు) నేతలతో సమావేశం అయ్యారు. ఈసందర్భంగా హృదయరాజు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. గత ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయుల అనేక హక్కులను కాలరాసిందని మండిపడ్డారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ తాము అధికారంలోకి వస్తే అన్ని సమస్యలను తీరుస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పండుగపూట కూడా ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలలో కడుపు నింపడంలేదన్నారు. ఈ పరిస్థితి మారాలంటే పోరుబాట తప్పదని పేర్కొన్నారు. సమావేశంలో ఫ్యాప్టో నేతలు శ్రీనివాసనాయక్, పురుషోత్తం, రమణారెడ్డి, సిరాజుద్దీన్, రాయల్‌వెంకటేష్, కులశేఖరరెడ్డి, లింగమయ్య, వెంకటరత్నం, గోపాల్‌రెడ్డి, సూర్యుడు, లింగమూర్తి, వెంకటసుబ్బయ్య, రవీంద్ర, రఫీ, వెంకటరెడ్డి, రామాంజినేయులు, సరిత, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ, నాగరాజు, ఖాన్, జార్జ్ పాల్గొన్నారు.

సరస్వతీ.. నమస్తుభ్యం

● శరన్నవరాత్రుల్లో భాగంగా ఎనిమిదో రోజున సరస్వతీదేవిగా అమ్మవార్ల దర్శనం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదోరోజు సోమవారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. అధిక ఆలయాల్లో సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. జిల్లాకేంద్రంలోని ఆలయాల్లో అర్చకులు వేకువజామునే అమ్మవార్ల మూలవిరాట్టులను, ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శంకరమఠంలోని శారదాదేవి ఆలయంలో దాదాపు 150 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. హెచ్చెల్సీ కాలనీలోని ననకోట ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో విద్యార్థులు సామూహిక కుంకుమార్చనలు చేశారు. శింగనమల, రాప్తాడు నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరిగాయి.


శివబాలయోగి ఆశ్రమంలో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు


శంకరమఠంలో సామూహిక అక్షరాభ్యాసంలో చిన్నారులు, తల్లిదండ్రులు,


హెచ్చెల్సీ కాలనీలోని ముత్యాలమ్మ ఆలయంలో కుంకుమార్చనలో విద్యార్థులు


పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సరస్వతీదేవిగా అమ్మవారి దర్శనం


జీసస్ నగర్‌లో సరస్వతి అలంకారంలో యల్లమ్మ అమ్మవారు

యల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

రామగిరి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేవీనవరాత్రుల సందర్భంగా స్వగ్రామమైన వెంకటాపురంలో గల యల్లమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం ఎమ్మెల్యే పరిటాలసునీత ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకులు అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. ఎమ్మెల్యే దర్శించుకుని పూజలు, అర్చనలు చేయించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. తర్వాత అన్నప్రసాదవితరణ చేపట్టారు.


ఆలయంలో అమ్మవారిని మొక్కుతున్న పరిటాల సునీత

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

వెంకటాపురంలో ఎమ్మెల్యే పరిటాల సునీత స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ కార్డుల వల్ల రేషన్ పంపిణీలో అక్రమాలకు తావుండదని పేర్కొన్నారు. అర్హులందరికీ ఈ కార్డులు అందజేస్తామని చెప్పారు. స్థానిక టీడీపీ నాయకులు, అధికారులు, రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

క్రీడాశాఖ సెల్ఫీ పాయింట్ సందర్శన

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ సేవింగ్స్ సెల్ఫీ పాయింట్‌ను కలెక్టర్ ఆనంద్ సందర్శించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ.. తగ్గిన జీఎస్టీ ధరల అమలుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. క్రీడాసామగ్రితో పాటు అన్ని రకాల వస్తువులు తగ్గిన ధరలకే విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఎస్‌డీఓ మంజుల ఆధ్వర్యంలో క్రీడా పరికరాల తగ్గింపుపై ఏర్పాటు చేసిన స్టాల్‌లో అధికారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. శాప్ కోచ్‌లు అనీల్‌కుమార్, లక్ష్మి, నరేష్‌కుమార్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.


సెల్ఫీ పాయింట్‌లో డీఎస్‌డీఓ మంజులతో కలెక్టర్

మత్తు పదార్థాలపై అవగాహన

అనంతపురం క్రైం, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి) : మత్తుపదార్థాలపై నగరంలోని రైల్వేస్టేషన్‌లో సోమవారం ప్రయాణికులకు, ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తుపదార్థాల వినియోగం వల్ల నష్టాలపై వివరించారు. కనుక ఎవరూ వాటి జోలికి వెళ్లరాదని సూచించారు. అంతకుమునుపు ఈగల్ టీం, జీఆర్పీ పోలీసులు, ఆర్పీఎఫ్ పోలీసులు రైల్వే స్టేషన్ పరిసరాల్లో తనిఖీలు చేశారు. ఈగల్ టీం జిల్లా ఇన్‌చార్జి హనుమంతు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థికసాయం

రాప్తాడు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసన్నాయపల్లిలో గల చిన్మయ్‌నగర్‌లో ఉన్న సెయింట్ జోసెఫ్ ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ మమత సీఎస్ కోట, వేపచెర్ల, కొండపల్లి, రాంపురం, తోపుదుర్తి గ్రామాలకు చెందిన 40 మంది పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేశారు. ఒక్కొక్కరికి రూ. 5 వేల నగదును అందించారు. అలాగే బుక్కులు, యూనిఫాం పంపిణీ చేశారు. చదువులో రాణిస్తున్న పేదవిద్యార్థులకు తమవంతు సాయం చేయాలని ఈ కార్యక్రమం చేపట్టినట్లు మమత తెలిపారు.

రావూరి లక్ష్మీదేవి ప్రమాణ స్వీకారం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్ర జ్యోతి): ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రావూరి లక్ష్మీదేవి ప్రమాణస్వీకారం చేశారు. కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణస్వీకారోత్సవాన్ని సోమవారం విజయవాడలో నిర్వహించారు. ఇందులో కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ, ఎండీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రావూరి లక్ష్మీదేవి ప్రమాణ స్వీకారం చేశారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న రావూరి లక్ష్మీదేవి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సొసైటీ సేవలను మరింత విస్తరింపజేస్తాం

● బీకేఎస్ సొసైటీ చైర్మన్ కేశన్న



బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతులకు నిరంతర సేవలందించడానికి తమ సహకార సొసైటీ పనిచేస్తోందని బుక్కరాయసముద్రం సహకార సొసైటీ చైర్మన్ చాకలి కేశన్న తెలిపారు. తమ సొసైటీని అన్ని రకాలా అభివృద్ధి చేసి సేవలను మరింత విస్తరింపజేస్తామని అన్నారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతికి పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న: బీకేఎస్ సహకార సొసైటీ బ్యాంకు ఎంత టర్నోవర్ చేస్తోంది.

జవాబు: దాదాపు రూ.25 కోట్లతో టర్నోవర్ చేస్తూ రైతులను సకాలంలో ఆదుకుంటోంది.

ప్రశ్న: బ్యాంకు నుంచి ఎలాంటి అభివృద్ధి చేయాలని ఉంది.

జవాబు: భవిష్యత్తులో సీఎం చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చంనాయుడు, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఏడీసీసీబీ చైర్మన్ కేశవరెడ్డి, నియోజకవర్గంలోని ముఖ్యటీడీపీ నేతల సహకారంతో నూతనంగా బ్యాంకు ఏర్పాటు చేయించి రైతులకు మరిన్ని సేవలందించాలని లక్ష్యంగా ఉన్నాం.

ప్రశ్న: ఎంత మంది రైతులు బ్యాంకు పరిధిలో ఉన్నారు

జవాబు: సహకార సొసైటీ బ్యాంకులో ప్రస్తుతం దాదాపు 4500 మంది రైతులు ఉన్నారు. వారికి క్రాప్‌లోన్లు, ఎల్‌టీ వంటి రుణాలు ఇస్తున్నాం. నూతనంగా నిర్మించిన గోడౌన్లు రైతులకు ఉపయోగపడే విధంగా త్వరలో ప్రణాళిక చేస్తున్నాం.

గుండెజబ్బుల పట్ల అవగాహన అవసరం

● వైద్యుల సూచన

● హృదయ దినోత్సవం సందర్భంగా నగరంలో ర్యాలీ

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని, ఇందుకు గుండెజబ్బుల పట్ల అవగాహన కలిగి ఉండి అవి రాకుండా జాగ్రత్తలు చేపట్టాలని వైద్యులు సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో సోమవారం వైద్య కళాశాల కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో భారీ ర్యాలీని నిర్వహించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ ర్యాలీని ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీ, సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం గుండెజబ్బుతో మరణించే వారి సంఖ్య అధికమవుతోందన్నారు. కనుక హృదయ సంబంధ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండి అవి రాకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. హృదయాన్ని జాగ్రత్తగా కాపాడుకోవడం ఎంత ముఖ్యమో తెలియజేయడానికి ప్రతి సంవత్సరం సెప్టెంబరు 29న ప్రపంచ హృదయ దినోత్సవాన్ని జరుపుతున్నట్లు చెప్పారు. 'డోంట్ మిస్ బీట్' అనే నినాదంతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కార్డియాలజీ విభాగంలో 100 ఐవీయూఎస్(ఇంట్రా వాస్క్యులర్ అల్ట్రా సౌండ్) గైడెడ్ యాంజియోప్లాస్టీలు, 1400 యాంజియోగ్రామ్‌లు విజయవంతంగా పూర్తిచేశామని వివరించారు. తెలుగు రాష్ట్రాల్లోనే ప్రభుత్వ రంగంలో ఈ సాంకేతికను పొందిన తొలి, ఏకైక ప్రభుత్వ మెడికల్ కాలేజి ఇదేనని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ బెనడిక్ట, విభాగాధిపతులు రవికుమార్, షోరోన్ సోనియ, శంకర్, మధుబాబు, ఆత్మారామ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న కిమ్స్ సవీరా హాస్పిటల్ వైద్యులు ,సిబ్బంది

కిమ్స్ సవీర ఆధ్వర్యంలో..

హృదయ దినోత్సవం సందర్భంగా కిమ్స్ సవీర హాస్పిటల్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. కార్డియాలజీ విభాగం డాక్టర్లు సందీప్, స్పందన క్లాక్‌టవర్ వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. గుండె జబ్బులకు చికిత్స కంటే వాటి బారిన పడకుండా ముందస్తు నివారణే ఉత్తమమని తెలిపారు. వయసుతో సంబంధం లేకుండా గుండె సమస్యలు వస్తున్నాయన్నారు. వాటి నివారణకు మంచి ఆహారం, వ్యాయామం దినసరి భాగం కావాలని సూచించారు. సీఈఓ సిద్దారెడ్డి మాట్లాడుతూ కిమ్స్ సవీరలో రెండు అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్‌లను ఏర్పాటుచేశామన్నారు. హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తక్కువ ప్యాకేజీతో హార్ట్‌చెకప్ తీసుకువచ్చామని వివరించారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

గజవాహనంపై వేంకటేశ్వరుడి దర్శనం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజున సోమవారం స్వామివారు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఉదయంమే ఆలయంలో భూదేవి, శ్రీదేవి సమేత స్వామివారి మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తిని గజవాహనంపై ఆశీనులు గావించి మేళతాలాలు, డప్పు వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ పురవీధుల్లో ఊరేగించారు.


గజవాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

సొసైటీల అభివృద్ధికి సహకరించండి


డీసీఎంఎస్, ఏడీసీసీబీ చైర్మన్లకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న సొసైటీ చైర్మన్లు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సొసైటీల అభివృద్ధికి సహకరించాలని రాప్తాడు నియోజకవర్గంలోని వివిధ సొసైటీల చైర్మన్లు కోరారు. ఆమేరకు జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్ ఆవరణలో సోమవారం వారు ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్‌ను కలిసి పుష్పగుచ్ఛాలందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. సొంత భవనాలులేని సొసైటీలకు కొత్త భవనాల నిర్మాణానికి సహకరించాలన్నారు. అదేవిధంగా కార్యాలయాల్లో ఫర్నీచర్ ఇతరాత్ర వాటి కొనుగోలుకు నిధులు కేటాయించాలని కోరారు. చియ్యేడు, రాచానపల్లి, యాలేరు, మరూరు, బుక్కచెర్ల సొసైటీల చైర్మన్లు లక్ష్మీనారాయణ, పాముురాయి రఘు, కృష్ణమోహన్, గోపాల్, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈఈపై చర్యలు తీసుకోవాలి: సీఐటీయూ

అనంతపురం రూరల్,సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వలస కార్మికుడు మరణానికి కారణమైన రాప్తాడు మండల విద్యుత్ శాఖ ఏఈఈపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీ నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ప్రధాన కార్యాలయం వద్ద సోమవారం ఆయన నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల రాప్తాడు మండలం హంపాపురం సబ్‌స్టేషన్ పరిధిలో 33కేవీ లైన్ పనులు చేస్తుండగా వలస కార్మికుడు బషీ విద్యుత్ ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడన్నారు. ఏఈఈ నిర్లక్ష్యం వలన ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఘటన జరిగి వారంరోజులు గడినా ఇంతవరకు అధికారిపై చర్యలు తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. కార్మికుడి మరణానికి కారణమైన ఏఈఈని విధుల నుంచి తొలగించాలన్నారు. మృతుడి కుటుంబానికి రూ. కోటి నష్టపరిహారం ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో తిరుపతిలో ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్ఈ శేషాద్రి శేఖర్‌కు వినతి పత్రం ఇచ్చారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి నాగమణి, సహాయకార్యదర్శి రామాంజినేయులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగులను నిరాశపరచిన అసెంబ్లీ సమావేశాలు'

అనంతపురం విద్య, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలు ఉద్యోగులను తీవ్రనిరాశకు గురిచేశాయని ఏపీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లివిజయ్‌కుమార్ సోమవారం ప్రకటనలో ఆవేదన వ్య క్తం చేశారు. దసరాకానుకగా పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు భత్యాలలో కనీసం రెండు ఇస్తారని, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటిస్తారని ఉద్యోగ,ఉపాధ్యాయులు ఆశతో ఎదురుచూశారన్నారు. అలాంటివేమీ ప్రకటించకుండానే అసెంబ్లీసమావేశాలు ముగియడం అందరినీ తీవ్రనిరాశకు గురి చేసిందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి హామీలను నెరవేర్చడానికి కృషిచేయాలని డిమాండ్ చేశారు.

నగరపాలక సంస్థలో 9 వినతులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అనంత నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నగర ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ 9 వినతిపత్రాలు సమర్పించారు. వాటిని ఇంచార్జి ఎంహెచ్‌ఓ నరసింహులు, ఇన్‌చార్జి ఏసీపీ శిరీష, ఇన్‌చార్జి కమిషనర్ రాజశేఖర్ స్వీకరించారు. బీజేపీ నాయకులు కార్యక్రమానికి వచ్చి మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బండారు సునీల్‌కుమార్ క్రైస్తవ మత ప్రచారంలో పాల్గొంటుండడంపై గత జూలై 27వతేదీన ఫిర్యాదు చేశామని, దానిపై ఏ చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇన్‌చార్జి కమిషనర్ స్పందిస్తూ పరిశీలించి సంబంధిత ఉద్యోగిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రేపు ఎస్‌జీఎఫ్ బాక్సింగ్ జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ అండర్-14, 17, 19 బాల, బాలికల బాక్సింగ్ జిల్లాస్థాయి పోటీలకు అక్టోబరు 1వతేదీన అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో క్రీడాకారుల ఎంపికను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హతగల వారు జననధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, యూనిఫాం, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు అక్టోబరు 5వతేదీ నుంచి రాజమహేంద్రవరంలో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ క్రీడాపోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 7989737474ను సంప్రదించాలని కోరారు.

పయ్యావుల శ్రీనివాసులును కలిసిన ఏయూఎన్‌టీఈఏ నాయకులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ సోదరుడు, టీడీపీ సీనియర్ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులును ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కలిశారు. జిల్లా కేంద్రంలోని నివాసంలో సోమవారం వారు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తిమ్మప్ప, డైరెక్టర్ ఉమాపతి, నాయకుడు భీమలింగప్ప చౌదరి తదితరులు పాల్గొన్నారు.


పయ్యావుల శీనప్పకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

జేఎన్‌టీయూఏలో ఘనంగా ఆయుధ పూజ

అనంతపురంరూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని జేఎన్‌టీయూఏ పరిపాలన భవనంలో సోమవారం ఆయుధ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య తదితరులు హాజరై దుర్గామాతకు పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులతో ప్రతి ఒక్కరికిమంచి కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీటూ వీసీ దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు భానుమూర్తి, సత్యనారాయణ, వైశాలి ఘెర్పడే, నాగప్రసాద్ నాయుడు, ప్రశాంతి, కిరణ్మయి, చిత్ర సుజాత, సురేష్‌బాబు, శోభాబిందు, సుబ్బారెడ్డి, దుర్గాప్రసాద్, పద్మసువర్ణ, శివకుమార్, చంద్రమోహన్‌రెడ్డి, ఓంప్రకాష్, డీఈ లక్ష్మి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, బోధన, బోధనేతరసిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారికి పూజ చేస్తున్న వీసీ తదితరులు

రుణ సదుపాయాన్ని వినియోగించుకోండి

గార్లదిన్నె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులు రుణ సదుపాయాన్ని పొంది జీవనోపాధి కల్పించుకుని ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం మల్లికార్జున సూచించారు. సెర్ప్ సీఈఓ, కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఆయన సీసీలు, వీఏఓలతో కలిసి వివిధ గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. మహి ళా సంఘాల సభ్యులు స్వయం శక్తితో ఆర్థికాభివృద్ధి సాధించేలా సెర్ప్ సంస్థ రుణ సదుపాయాన్ని కల్పించడానికి చర్యలు చేపట్టిందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా పీఎంఎఫ్‌ఎంఈ, పీఎంఈజీపీ రుణాలివ్వడానికి కూడా బ్యాంకులు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీసీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

గార్లదిన్నె, సెప్టెంబరు 29(ఆంధ్ర జ్యోతి): మండలంలోని కమలాపురం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచు, టీడీపీ సీనియర్ నాయకుడు నల్లప్ప (75) అనారోగ్యంతో సోమవారం తెల్లవారుజామున అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు టీడీపీ, సీపీఐ నాయకులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. 2014 టీడీపీ హయాంలో సర్పంచ్‌గా పని చేసిన ఆయన పంచాయతీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు కొండయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శీనప్ప, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు శ్రీనాథ్‌చౌదరి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


నల్లప్ప (ఫైల్)

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా హోలగుందకు చెందిన వెంకటేష్ అనే యువకుడికి అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన యువతితో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. అయితే కొద్దిరోజుల క్రితం భార్య పుట్టింటికి వచ్చింది. ఆమెను తిరిగి తీసుకెళ్లడానికి వెంకటేష్ సోమవారం యర్రగుంట్లకు వచ్చాడు. అయితే ఆమె భర్త ఇంటికి వెళ్లడానికి నిరాకరించింది. ఈ క్రమంలో ఇద్దరు గొడవపడ్డారు. మనస్థాపం చెందిన వెంకటేష్ మధ్యాహ్న సమయంలో గార్లదిన్నెలోని రైల్వేగేట్ సమీపంలో గుంతకల్లు నుంచి తిరుపతి వైపు వెళుతున్న రైలు కింద పడడానికి ప్రయత్నించాడు. స్థానికులు గమనించి అతన్ని రైలు పట్టాల మీద నుంచి పక్కకు తోసేశారు.

ముగిసిన భాగవత సప్తాహం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోర్టురోడ్డులోని వరదాంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న భాగవతా సప్తాహం సోమవారం సాయంత్రం ముగిసింది. కార్యక్రమానికి మేయర్ వసీం హాజరై మాట్లాడారు. వారంరోజులపాటు ఎంతో భక్తిశ్రద్ధలతో భాగవత సప్తాహం చేపట్టడం అభినందనీయమన్నారు. కార్పొరేటర్ కమల్‌భూషణ్, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శింగనమల మార్కెట్ కమిటీ నియామకం

బుక్కరాయసముద్రం/శింగనమల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శింగనమల మార్కెట్ యార్డు పాలక వర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో మార్కె ట్ యార్డు చైర్మన్‌గా దండుశ్రీనివాసులును ఇది వరకే ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా బుక్కరాయసముద్రం మండలకేంద్రానికి చెందిన టీడీపీ మండల అధికార ప్రతినిధి ఓబుళపతి భార్య ఎస్. శైలజను వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమించారు. వీరితో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురిని పాలకవర్గ సభ్యులుగా నియమించారు. వారిలో ఎస్‌పుల్లన్న, సోమర భాగ్యలక్ష్మి, చింతానాగలక్ష్మి, చెన్నారెడ్డి, ముత్యాల రామసుబ్బమ్మ, రామకృష్ణారెడ్డి, కోటూరు వెంకటరత్న, చొప్పవిజయలక్ష్మి, చాకలినిహారిక, రాజా, ఆల్లాశ్రీపతినాయుడు, సాకే ఈశ్వరయ్య, కనుమనారాయణస్వామి ఉన్నారు. వారితోపాటు బి. పప్పూరు సహకార సొసైటీ చైర్మన్, అగ్రికల్చర్ ఏడీ, జంతులూరు గ్రామ సర్పంచ్, జిల్లా అగ్రి ట్రేడ్ , మార్కెటింగ్ ఆఫీసర్, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని సైతం పాలక వర్గంలో చేరుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.


దండు శ్రీనివాసులు, చైర్మన్


ఎస్. శైలజ, వైస్ చైర్‌పర్సన్

పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు

గార్లదిన్నె, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవలో భాగంగా సోమవారం మండలంలోని అన్ని సచివాలయాల్లో పారిశుధ్య కార్మికులకు (గ్రీన్ అంబాసిడర్లు) వైద్యశిబిరాన్ని నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో వైద్యపరీక్షల అనంతరం పారిశుధ్య కార్మికులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి మాట్లాడుతూ... పరిసరాలను పరిశుభ్రం చేసి ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వారి సేవలు మరువలేనివన్నారు. సర్పంచులు సుబ్బమ్మ, లక్ష్మి, వైద్యులు ఉదయ్, మంజుల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మణ్, ఆర్‌డబ్ల్యూఎస్ కో ఆర్డినేటర్ అనురాధ, ఏపీఓ ఓబన్న, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం'

అనంతపురం క్రైం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పద్మశాలి కులస్థుడైన అవ్వారు నరేష్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నందన్ అబద్దయ్య, డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, పొరాళ్ల పురుషోత్తం భరోసా ఇచ్చారు. ఇటీవల నరేష్ అప్పుల బాధలు తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళగిరిలో ఉన్న అతడి కుటుంబ సభ్యులను ఆ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, డైరెక్టర్లు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నరేష్ మృతితో ఆ కుటుంబానికి పెద్ద దిక్కు లేకుండా పోయిందన్నారు. చదువుకుంటున్న ఆడబిడ్డలు ఉన్నారని, వారికి తప్పక న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం కుటుంబసభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.


నరేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లు

న్యూస్ బాక్స్

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష వితరణ



దాతను సన్మానిస్తున్న సభ్యులు

బెళుగుప్ప, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక మంజునాథస్వామి అభివృద్ధికి స్థానిక విశ్రాంత ఉపాధ్యాయుడు రాచర్ల వెంకటేశులు రూ.లక్షా రెండు వందలను ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. దీంతో ఆయన్ను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

పని గంటల పెంపు జీఓను రద్దుచేయాలి

గుంతకల్లు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుగా ఉన్న ఎనిమిది గంటల పనివిధానాన్ని కాలరాసేలా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యాక్టరీల చట్టం సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బీ సురేశ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిలాన్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు,రాందాస్, నారాయణ, బాషా, గోపి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న విప్

రాయదుర్గం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ముగ్గురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.4,18,890 మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను ఆయా బాధితులకు విప్ కాలవ శ్రీనివాసులు స్థానిక తన స్వగృహంలో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు లాలెప్ప, కురుబ హనుమంతులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కంబదూరు ఆర్‌అండ్‌బీ రింగ్‌రోడ్డులో నవంబరు 8వ తేదీన భక్త కనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నారని, ఆ సర్కిల్‌లో ఆక్రమణలు తొలగించి అభివృద్ధికి సహకరించాలని కురుబ కులస్థులు, టీడీపీ నాయకులు కోరుతున్నారు. ఈ మేరకు ఆర్డీఓ వసంత్‌బాబును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

భాగవతుల కళాకారులకు పింఛన్ ఇవ్వాలి

యల్లనూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం భాగవతులు కళాకారులకు పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆధ్యాత్మికవేత్త, రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి కోరారు. సోమవారం పాతపల్లి గ్రామంలో నిర్వహించిన భాగవత సప్తాహ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగద్గురు ఆదిశంకరాచార్య భాగవత సమాజం ఆధ్వర్యంలో 24వ భాగవత పఠన శ్రవణ యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సమాజ సభ్యులను అభినందించారు. అనంతరం భాగవత కళాకారులను గ్రామ పెద్ద చంద్రశేఖర్‌రెడ్డి సన్మానించారు.

గంగమ్మ ఆలయ వార్షికోత్సవాలు



కలశ పూజ

పుట్లూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలాపురం గ్రామంలో గంగమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ప్రారంభించారు. మొదటి రోజైన సోమవారం అమ్మవారికి కలశ పూజ, హోమం నిర్వహించారు. రాత్రికి భజన కార్యక్రమం నిర్వహించారు. రెండో రోజైన మంగళవారం ప్రతి ఇంటి నుంచి నీరు తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

చర్చాగోష్ఠిలో విద్యార్థినుల సత్తా



మేఘనాబాయి, ఐశ్వర్య

బెళుగుప్ప, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ, వారధి ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా సోషల్ మీడియాతో లాభాలు, నష్టాలపై జిల్లాస్థాయిలో సోమవారం నిర్వహించిన డిబేట్‌లో బెళుగుప్ప ఉన్నత పాఠశాల విద్యార్థినులు మేఘనాబాయి, ఐశ్వర్య ప్రతిభ చాటారు. అక్టోబరు 10న నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు వీరు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకట ప్రసాద్ తెలిపారు.

సీఐగా హరినాథ్ బాధ్యతల స్వీకరణ



కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణ సీఐగా హరినాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం డీసీఆర్బీ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడి సీఐ యువరాజు వీఆర్‌కు వెళ్లారు.

అక్రమ కట్టడాలపై చర్యలు

తాడిపత్రి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వైసీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, అంబటి రాఘవరెడ్డి, ఫయాజ్‌బాషా ఇళ్లను అక్రమంగా నిర్మించుకున్నారని, కమిటీ ఆదేశాలకు అనుగుణంగా వాటిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ సూచించింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వైస్ ఛైర్మన్ అరుణ ఆధ్వర్యంలో సోమవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై అజెండా చదివి వినిపించారు. ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీ, పట్టణ శివారులోని సీసీ రోడ్లు తదితర అంశాలపై ఆమోదించారు.

ఆలయ స్థలం అప్పగింతకు అంగీకారం

కుందుర్పి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకొని.. షెడ్లు సైతం నిర్మించుకున్నారు. ఈ విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఇటీవల ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆక్రమణదారులతో మాట్లాడి.. ప్రత్యామ్నాయం చూపించి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆలయ స్థలాన్ని ఖాళీ చేయడానికి అంగీకరించారు.

నేడు పశువైద్య శిబిరం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గుత్తి మండలం శ్రీపురంలో మంగళవారం పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి వెంకటేష్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇందులో పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్ పాల్గొంటారనీ, పాడి రైతులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యానిమేటర్ తొలగింపు అన్యాయం

పెద్దవడుగూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాంపల్లి గ్రామసంఘం యానిమేటర్ పద్మావతిని తొలగించడం అన్యాయమని ఆ గ్రామ పొదుపు సంఘాల ప్రతినిధులు స్థానిక వెలుగు కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. వెలుగు ఏపీఎం ఖలీల్, సీసీ కులశేఖర్‌రెడ్డి, జయరాం కలిసి అప్పులు చెల్లించని వారిపై చర్యలు తీసుకోకుండా.. పదేళ్లుగా పని చేస్తున్న యానిమేటర్ పద్మావతిని తొలగించడం అన్యాయమని మండిపడ్డారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు.

సామాంపాతు సరస్వతీ



కళ్యాణదుర్గం: సరస్వతీదేవిగా వాసవీమాత



తాడిపత్రి : సరస్వతీదేవిగా కన్యకాపరమేశ్వరి




ఉరవకొండలో ఈశ్వరమ్మ

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని ఎనిమిదవ రోజైన సోమ వారం అమ్మవార్లు పలు ప్రాంతాల్లో సరస్వతిదేవి అలంకరణలో దర్శన మించారు. గుంతకల్లులో కన్యకా పరమే శ్వరీదేవిని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయానికి రూ.28 వేలు, రెడ్డి స్ట్రీట్‌లో రాతి శివాలయానికి రూ.50 వేలు విరాళమిచ్చారు.



గుంతకల్లు : కన్యకా పరమేశ్వరికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు



రాయదుర్గం: శ్రీనగరేశ్వర కన్యకపరమేశ్వరి

సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం

మధ్యాహ్నం మూడున్నర గంటలకే తాళం

బెళుగుప్ప, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సచివాలయ సిబ్బంది విధులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. గుండ్లపల్లిలో సిబ్బంది సమయ పాలన పాటించడం లేదనే విమర్శలున్నాయి. దీంతో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఆ సచివాలయాన్ని ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. అప్పటికే ఆ కార్యాలయం మూసివేసి ఉంది. కార్యక్రమంలో మొత్తం పది మంది సిబ్బంది ఉండగా.. ఏ ఒక్కరూ లేరు. దీనిపై ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఈఓ పృథ్వీసాగర్‌ను వివరణ కోరగా.. సెక్రెటరీ పింఛన్ల డబ్బు కోసం బ్యాంకుకు వెళ్లారని, వ్యవసాయ సిబ్బంది తిమ్మారెడ్డి ఈ క్రాప్ బుకింగ్ ఫీల్డ్‌కు వెళ్లారని తెలిపారు. మిగిలిన సిబ్బందిపై విచారించి.. చర్యలు తీసుకుంటామన్నారు.



గుండ్లపల్లిలో 3.30 గంటలకే తాళం వేసిన సచివాలయం

కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌కు సన్మానం



సుదర్శన్‌నాయుడిని సన్మానిస్తున్న నాయకులు

పుట్లూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సుదర్శన్‌నాయుడును అనంతపురం కమ్మభవన్‌లో ఆ సంఘం నాయకులు సోమవారం సన్మానించారు. కమ్మసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొడాలి వెంకటసుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకటరావు, జిల్లా అధ్యక్షుడు నాగన్న ఆయన్ను సన్మానించారు. వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కమ్మసంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు.కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు ఆదినారాయణరెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే ముఖ్యం



మాట్లాడుతున్న ఆవులదట్ల పీహెచ్‌సీ వైద్యులు

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కుటుంబంలో మహిళలు ఆరోగ్యంగా ఉంటే.. కుటుంబసభ్యులంతా ఆరోగ్యంగా ఉంటారని ఆవులదట్ల పీహెచ్‌సీ వైద్యులు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వేపరాల గ్రామంలో స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలకు ప్రధానంగా వచ్చే వ్యాధుల్లో నోటి, రొమ్ము, గర్భసంచి క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు 19 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామాంజినేయులు, సుజాత, ఎఎన్ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఏబీఆర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

కూడేరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పెన్నాహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో పెరిగింది. తుంగ భద్ర డ్యాం నుంచి 260 క్యూసెక్కులు, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి 290 క్యూసెక్కులు నీరు రావడంతో పీఏబీఆర్‌లో నీటి నిల్వ ఐదు టీఎంసీల కు చేరింది. రెండురోజులుగా డ్యాంలోకి నీటి ప్రవాహం పెరిగినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.



పీఏబీఆర్ డ్యాంలో గేట్లవద్దకు చేరిన నీరు

'జీడిపల్లి'కి ఇన్‌ఫ్లో 2,431 క్యూసెక్కులు

బెళుగుప్ప, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,431 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2,391 క్యూసెక్కులు హంద్రీనీవా అధికారులు సోమవారం వెల్లడించారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.710 టీఎంసీల నీరు ఉందని, ఫేజ్-2కు 1,904 క్యూసెక్కుల నీరు వెళ్తోందని తెలిపారు.

మార్కెట్‌యార్డు డైరెక్టర్‌గా రామకృష్ణారెడ్డి



యల్లనూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శింగనమల మార్కెట్‌యార్డు డైరెక్టర్‌గా మండలానికి చెందిన రామకృష్ణారెడ్డిని ప్రభుత్వం నియమించినట్లు మండల కన్వీనర్ రామాంజనేయులు తెలిపారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి శింగనమల మార్కెట్‌యార్డు డైరెక్టర్‌గా నియమించేందుకు సహకరించిన ఎమ్మెల్యే బండారు శ్రావణికి రుణపడి ఉంటానని తెలిపారు.

స్థలాల రద్దుపై వాగ్వాదం



సమావేశంలో కౌన్సిలర్ల వాగ్వాదం

రాయదుర్గం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పునాది దశలోనే ఉంచిన వారి ఇళ్ల స్థలాలను రద్దు చేసి ఆసక్తి, అర్హత ఉన్న వారికి కేటాయించాలని టీడీపీ కౌన్సిలర్లు.. ఆ స్థలాలను రద్దు చేయరాదని వైసీపీ కౌన్సిలర్లు వాదనకు దిగారు. ఇరువర్గాల కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం సాగింది. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా అజెండా సరిగ్గాలేదని కౌన్సిలర్లు మండిపడ్డారు. ఏళ్లతరబడి నిర్మాణాలు చేపట్టని స్థలాల్లో రెవెన్యూ అధికారులు నోటీసులు అతికించి రద్దు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారని, దాన్ని ఆపాలని వైసీపీ కౌన్సిలర్లు కోరారు. దీనిపై అధికారులు సమాధానమిస్తూ అర్హులకు న్యాయం చేయాలనే లక్ష్యంతోనే ఈ చర్యకు పూనుకున్నట్లు స్పష్టంచేశారు. టీడీపీ కౌన్సిలర్లూ వారికి మద్దతుగా వైసీపీ వారితో వాదనకు దిగారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కమిటీ సభ్యులు

పెద్దపప్పూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అశ్వర్థనారాయణస్వామి చక్రస్థాపన బీమలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఛైర్మన్‌గా బిందెల శివశంకర్‌రెడ్డి, సభ్యులుగా రావి లక్ష్మిదేవి, బాల చితంబరి, రంగస్వామి, సుధామణి, పుల్లమ్మ, లక్ష్మిదేవి, వెంకటశివారెడ్డి, పవన్‌కుమార్, అంజనమ్మ ఆలయ ఈఓ సుబ్రమణ్యం ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, నాయకుడు ఎస్వీ రవీంద్రారెడ్డి, మండల కన్వీనర్ తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్, నాయకులు బీసీ రామకృష్ణారెడ్డి, శశిధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, అనిల్‌కుమార్, పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

యల్లనూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌ను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు సోమవారం తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్ఐ రామాంజనేయులరెడ్డి, పుట్లూరు రూరల్ సీఐ సత్యబాబు, సిబ్బంది ఉన్నారు.

వైసీపీ అక్రమ కేసుతో ఉద్యోగం పోయింది

ఆదుకోవాలని కలెక్టర్‌కు అంగన్‌వాడీ టీచర్ వినతి



కలెక్టరేట్‌లో అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి నిరీక్షణ

కుందుర్పి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు తనపై అక్రమ కేసు బనాయించి.. తన ఉద్యోగం పోయేలా చేశారని, తనకు న్యాయం చేయాలని మండలంలోని కొలిమిపాలెం అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం కలెక్టర్ ఆనంద్ వద్ద వాపోయారు. ఆమె మాట్లాడుతూ... నేను కొలిమిపాలెంలో అంగన్‌వాడీ టీచర్‌ను. నేను, నా భర్త కిరాణా కొట్టు నిర్వహిస్తున్నాం. మా కుటుంబ సభ్యులు టీడీపీ వారు కావడంతో గ్రామంలోని వైసీపీ నాయకులు నాపై కుట్ర పన్నారు. మా కొట్టులో గుట్కాలు, మద్యం, టెట్రా ప్యాకెట్లు ఉంచి.. నాపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ గణేష్‌పై వాళ్లు ఒత్తిడి తెచ్చి అక్రమ కేసు బనాయించి.. నా ఉద్యోగం పోయేలా చేశారు. ఈ విషయంలో నాకు న్యాయం చేయాలని గతంలో ఎస్పీ వద్ద మొరపెట్టుకున్నా. అయినా ఫలితం లేదు. కలెక్టరైనా స్పందించి నాకు న్యాయం చేయాలి..' అని రాజేశ్వరి కలెక్టర్‌ను కోరినట్లు తెలిపింది.

● స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై ఫిర్యాదు

గుంతకల్లు: స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ధర్మా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ నాయకుడు వీరాంజనేయులు కలెక్టరు గ్రీవెన్సులో ఫిర్యాదు చేశారు. ఇళ్ల వద్దకు వెళ్లి స్మార్ట్ కార్డులను పంపిణీ చేయాల్సిన అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కొందరికి కార్డులు ఇవ్వలేదన్నారు. గ్రామంలో కొందరి కార్డులు అదృశ్యం అయ్యాయని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

● సబ్సిడీతో విత్తనాలు అందించాలి

తాడిపత్రి : రైతులకు 90 శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలను అందించాలని రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి వ్యవసాయ డివిజన్ అధికారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట వీరరాఘవరెడ్డి, శిరీష, వేణుగోపాల్ ఉన్నారు.

● బకాయిలను చెల్లించాలి: పెన్షనర్లకు ప్రభుత్వం బకాయిలను వెంటనే చెల్లించాలని పెన్షనర్ల సంఘం సభ్యులు సత్యనారాయణ, హనుమంతరెడ్డి, వెంకటరామయ్య తహసీల్దార్ సోమశేఖర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు.

క్రైం న్యూస్..

బాలుడి మృతిపై విచారణ

డాక్టర్‌ను సస్పెండ్ చేస్తూ అధికారుల ఉత్తర్వులు



విచారణ చేస్తున్న సభ్యులు

ఉరవకొండ, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీహెచ్‌సీ ఆసుపత్రిలో ఈనెల 26న చాబాల గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు అహరూన్ కుమార్ మరణించిన ఘటనపై ప్రత్యేక బృందం అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. ఈ మరణానికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని బాధితులు ఆరోపించిన నేపథ్యంలో దీనిపై సమగ్ర విచారణకు కలెక్టర్ ముగ్గురు అధికారులతో ఈ బృందాన్ని నియమించారు. ఆరోపణలున్న వైద్యుడు ఇస్మాయిల్‌ను సస్పెండ్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. బృందంలోని సభ్యులు డీఎంహెచ్ఓ ఈబీ దేవి, అనంతపురం సర్వజన ఆసుపత్రి పీడియాట్రీషన్ లోక్‌నాథ్, డీసీహెచ్ డేవిడ్ సెల్వరాజ్ బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు పంపతున్నట్లు వారు తెలిపారు.

పంటకు గడ్డి నివారణ మందు పిచికారీ



దెబ్బతిన్న పంట

విడపనకల్లు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తన రెండు ఎకరాల్లో సాగుచేసిన కంది, వేరుశనగ పంటలకు గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందును పిచికారి చేసి.. పంటలను ఎండిపోయేలా చేశారని మండలంలోని హావళిగి గ్రామ రైతు, టీడీపీ నాయకుడు నాగేష్ సోమవారం వాపోయాడు. నాలుగు రోజుల క్రితం పంటలకు గడ్డిని నివారించే మందును కొట్టారని, దీంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. దాదాపుగా రూ. 2లక్షల వరకు తనకు నష్టం వచ్చిందని, దీనిపై పాల్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు.

విద్యుదాఘాతంతో వాహనం దగ్ధం

పెద్దవడుగూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదరగుట్టపల్లి గ్రామ సమీపంలో శనివారం అర్ధరాత్రి విద్యుదాఘాతంతో ఐచర్ వాహనం దగ్ధమైంది. కిష్టిపాడుకు చెందిన మునిరెడ్డి కొన్నిరోజుల క్రితం ఐచర్ వాహనం తీసుకున్నాడు. సాంకేతికలోపం తలెత్తడంతో అనంతపురంలోని షోరూంకు తీసుకొని వెళుతున్న సమయంలో షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు వ్యాపించాయి. డ్రైవర్ అప్రమత్తమై బయటకు వచ్చేశాడు. వాహనం పూర్తిగా దగ్ధమైంది.

ద్విచక్రవాహనానికి నిప్పు

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): బ్రహ్మసముద్రం మండలం వంకతండా వాసి, వైస్ ఎంపీపీ వెంకటేష్ నాయక్ కళ్యాణదుర్గం కాపర్లపల్లి తండాలోని వాళ్ల అక్క ఇంటికి ఆదివారం వెళ్లాడు. రాత్రి ఇంటి ముందర ఉంచిన అతని ద్విచక్ర వాహనానికి దుండగులు నిప్పుపెట్టడంతో అది దగ్ధమైంది. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడిళ్లలో చోరీ

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చర్చి ఏరియాలో మూడిళ్లలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. తాళం వేసిన ఇళ్లల్లోకి చొరబడిన దుండగులు నగదు ఎత్తుకెళ్లారు. గంగానాయక్ ఇంట్లో రూ. 50 వేలు నగదు, మూడు పట్టుచీరలు, కవితాబాయి ఇంట్లో రూ. 20 వేలు, మోహన్‌నాయక్ ఇంట్లో రూ. నాలుగువేలు నగదు చోరీ అయింది. దీనిపై బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు సీఐ జయనాయక్ తెలిపారు.

తెగిపడిన విద్యుత్ తీగ



తెగిపడిన విద్యుత్ వైరు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంతకల్లు గ్రామంలో పాత పంచాయతీ కార్యాలయం వీధిలో విద్యుత్ వైరు సోమవారం సాయంత్రం తెగిపడింది. ఆ సమయంలో వర్షం వస్తుండటంతో వీధిలో ఎవరూ లేరు. దీంతో పెనుప్రమాదం తప్పినట్లైంది. వైరు తెగిన విషయాన్ని గమనించిన స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. చాలాకాలంగా 11 కేవీ వైర్లు దెబ్బతిని.. ప్రమాదకరంగా వేలాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాత వైర్లను మార్చాలని కోరుతున్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా యూనస్



తాడిపత్రి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణం సబ్‌రిజిస్ట్రార్‌గా యూనస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అనంతపురం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. కొన్నిరోజులుగా సబ్‌రిజిస్ట్రార్ లేకపోవడంతో ఇక్కడ సీనియర్ అధికారి శివకుమార్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించేవారు.

భూసమస్యలు పరిష్కరించండి



రామాంజనేయులును పరామర్శిస్తున్న కొనకొండ్ల రాజేష్

కూడేరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో భూ సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే తహసీల్దారు కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని అంతరగంగ గ్రామానికి చెందిన అవిలికొండ రామాంజినేయులు భూ సమస్య పరిష్కారం కాకపోవడంతో అనారోగ్య బారిన పడ్డారు. ఆయన్ను సోమవారం పరామర్శించిన రాజేష్ మాట్లాడారు. మండలంలో చాలామంది రైతులు భూమి సమస్యలతో సతమతమవుతున్నారని, వాటిని పరిష్కరించకుండా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం తగదన్నారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి నాగేంద్ర, మండల అధ్యక్షుడు నాగరాజు, వెంకటేష్‌నాయక్, మల్లోబులు, రాము, రవి ఉన్నారు.